



విమానాశ్రయంలో భారత జట్టు ఆటగాళ్లు రోహిత్‌శర్మ, విరాట్ కోహ్లి

మన్యం బిడ్డ కరుణకుమారికి సత్కారం



అంధుల మహిళా టీ20 వరల్డ్ కప్‌లో భారత్ విజయం సాధించడంలో కీలకపాత్ర పోషించిన మన్యం బాలిక కరుణకుమారిని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ సత్కరించారు. (-వార్త 8లో)

విశాఖకు క్రికెటర్లు



విమానాశ్రయంలో సౌతాఫ్రికా ఆటగాడు క్వింటాన్ డీకాక్

- నేడు ప్రాక్టీస్
- వన్డే మ్యాచ్ రేపు

విశాఖపట్నం స్పోర్ట్స్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో శనివారం జరగనున్న వన్డే మ్యాచ్‌లో తలపడనున్న భారత్, దక్షిణాఫ్రికా జట్ల ఆటగాళ్లు రాయ్‌పూర్ నుంచి ప్రత్యేక విమానంలో గురువారం సాయంత్రం నగరానికి చేరుకున్నారు. విమానాశ్రయం నుంచి ప్రత్యేక బస్సుల్లో రాడిసన్ బ్లూ హోటల్‌కు వెళ్లారు. శుక్రవారం ఏసీఏ-వీడీసీఏ స్టేడియం సాధన చేయనున్నారు.

ప్రజలకు చేరువగా పాలన

వికేంద్రీకరణతో సత్వరమే ప్రభుత్వ సేవలు

- శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు
- నర్సీపట్నంలో డీడీవో కార్యాలయం ప్రారంభం



డీడీవో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేయాలన్న ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం పరిపాలన వికేంద్రీకరణకు పెద్దపీట వేసిందని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. గురువారం నర్సీపట్నం పాత మునిసిపల్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన డివిజనల్ అభివృద్ధి అధికారి (డీడీవో) కార్యాలయాన్ని ప్రారంభించి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పంచాయతీలకు సంబంధించి చిన్నచిన్న సమస్యల పరిష్కారానికి జిల్లా కేంద్రానికి, జిల్లా పరిషత్తులకు వెళ్లాల్సి వచ్చేదని అన్నారు. ఇప్పుడు డివిజన్ స్థాయి ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ, డివిజన్ పంచాయతీ, డివిజన్ అభివృద్ధి అధికారుల కార్యాలయాలను ఒకే ఆవరణలో ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ అవుతాయని తెలిపారు. దీని వల్ల సమయం, ఖర్చులు ఆదా అవుతాయని అన్నారు. నాలుగు దశాబ్దాల క్రితం సమితులు వున్నప్పుడు ఉద్యోగులకు పదోన్నతులు లభించాయని, మళ్లీ ఇన్నాళ్లకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవతో డీడీవో కార్యాలయాలు ఏర్పాటై, ఉద్యోగులకు పదోన్నతులు లభించాయని చెప్పారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఇక్కడి నుంచి అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా డీడీవో కార్యాలయాలకు సొంత భవనాలు ఒకే నమూనాతో నిర్మాణం చేపడితే బాగుటుందని సూచించారు. ఉపాధి హామీ పథకం నిధులతో పంట కాలువలకు సిమెంట్ లైనింగ్ పనులు చేపడితే రైతులకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి సూర్యచంద్ర, జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ, జడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి, ఆర్డీవో వీవీ రమణ, డీఎస్పీ శ్రీనివాసరావు, డీడీవో ఇ.నాగలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ గవిరెడ్డి వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లిలో...

కొత్తూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలంలో కొత్తూరులో ఏర్పాటు చేసిన అనకాపల్లి డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేశ్‌బాబు, బండారు సత్యనారాయణమూర్తి, సుందరపు విజయ్‌కుమార్ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, డీడీవో మంజులావాణి, డ్వామా పీడీ పూర్ణిమాదేవి, డీపీవో ఇ.సందీప్, పీఆర్ డీఈ వేణుగోపాల్, ఎంపీడీవో ఆశాజ్యోతి, ఏపీడీ మణికుమార్, ఏపీవో సుప్రియ తదితరులు పాల్గొన్నారు.



అనకాపల్లి మండలం కొత్తూరులో డీడీవో కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యేలు, కలెక్టర్

జోరుగా వరి కోతలు

తుఫాన్ ప్రభావం తగ్గడంతో ఊపిరిపీల్చుకున్న రైతులు

- సాధారణ స్థితికి వాతావరణం
- వారం రోజుల విరామం తరువాత వరి కోతలు పునఃప్రారంభం
- రైతులకు అందుబాటులో కోత, నూర్పిడి యంత్రాలు
- పలు కేంద్రాల్లో మొదలైన ధాన్యం కొనుగోళ్లు



రావికమతం మండలం కొమిరలో వరి పంట కోస్తున్న కూలీలు



రావికమతం మండలం మత్స్యపురంలో వరి పంటను యంత్రాలతో నూరుస్తున్న రైతులు

అనకాపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): **వారం రోజుల విరామం తరువాత జిల్లాలో వరి కోతలు పునఃప్రారంభం అయ్యాయి. తుఫాన్ ప్రభావం పూర్తిగా తగ్గిపోయి వాతావరణం తెరిపివ్వడంతో రైతులు వరి కోతల పనులను ముమ్మరం చేశారు. వారం క్రితం కుప్ప వేసిన రైతులు వరి పంటను నూర్చుతున్నారు.**

బంగాళాతంలో ఏర్పడిన 'దిత్వా' తుఫాన్ ప్రభావంతో ఆకాశం మేఘావృతంగా వుండడం, జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం వుందన్న వాతావరణ శాఖ సమాచారంతో రైతులు వరి కోతలను వాయిదా వేసిన విషయం తెలిసిందే. అప్పటికే కోత కోసిన పొలాల్లో రైతులు ఆదరాబాదరా కుప్పలు వేసుకున్నారు. తుఫాన్ ప్రభావం అనకాపల్లి జిల్లాపై అంతగా ప్రభావం చూపకపోవడంతో అన్నదాతలు ఊరట చెందారు. రెండు, మూడు రోజులపాటు చెదురుమదురుగా జల్లులు పడినప్పటికీ ఎక్కడా వరి పంటకు నష్టం వాటిల్లలేదు. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సుమారు 55 వేల హెక్టార్లలో వరి సాగు చేపట్టారు. ఆకుమడులు పోసేటప్పుడు, నాట్లు వేసే సమయంలో అవసరమైన మేర వర్షాలు పడకపోవడంతో వరినాట్లు కొంతమేర ఆలస్యం అయ్యాయి. ఆగస్టు రెండో వారం నుంచి విస్తారంగా వర్షాలు పడడంతో అప్పుడు వరినాట్లు ఊపందుకున్నాయి. సాధారణంగా జిల్లాలో నవంబరు నెలలో వరి కోతలు, నూర్పిడి పనులు ముమ్మరంగా సాగుతాయి. అయితే ఈ ఏడాది వరినాట్లు ఆలస్యం కావడంతో ఆ ప్రభావం వరి కోతలపై పడింది. బోర్లు, బావుల కింద ముందస్తుగా వరినాట్లు వేసిన పొలాల్లో నవంబరు రెండో వారం నుంచే కోతలు మొదలుపెట్టగా, మిగిలినచోట్ల మూడో వారంలో ప్రారంభించారు. వరికోతలు ఊపందుకునే చివరి వారంలో బంగాళా ఖాతంలో తుఫాన్ ఏర్పడడంతో ఆటంకం ఏర్పడింది. సుమారు వారం రోజులపాటు వరికోతలు చేపట్టలేదు. తుఫాన్ గమనం నెమ్మదించడం, దిశ మార్చుకోవడం వంటి పరిణామాలతో జిల్లాలో నాలుగైదు రోజులపాటు ముసురు వాతావరణం నెలకొని, అడపాదడపా జల్లులు పడ్డాయి. తుఫాన్ బుధవారం వాయుగుండంగా బలహీనపడి తీరాన్ని తాకిన తరువాత అల్పపీడనంగా మరింత బలహీన పడింది. దీంతో గురువారం ఆకాశం నిర్మలంగా వుండి ఎండ కాయడంతో రైతులు వరి కోతలు మొదలుపెట్టారు. తుఫాన్‌కు ముందు వరికోతలు పూర్తిచేసి, హడావిడిగా కుప్పలు వేసిన రైతులు.. ఇప్పుడు కుప్ప నూర్పిడి పనులు చేపట్టారు. వాతావరణం ఇదే విధంగా కొనసాగితే మరో పక్షం రోజుల్లో జిల్లా అంతటా వరి కోతలు పూర్తవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

మొదలైన ధాన్యం సేకరణ

పౌరసరఫరా శాఖ అధికారులు జిల్లాలో ఇప్పటికే ధాన్యం సేకరణను ప్రారంభించారు. గురువారంనాటికి ... మిగతా 8వ పేజీలో

నేడే మెగా పీటీఎం

జిల్లా వ్యాప్తంగా అన్ని విద్యా సంస్థల్లో పేరెంట్, టీచర్ మీటింగ్

- పండుగలా నిర్వహించాలని ప్రభుత్వ ఆదేశాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధ్యాపక, ఉపాధ్యాయ సిబ్బంది



నక్కపల్లి మండలం బోదిగల్లం ఉన్నత పాఠశాలలో మెగా పీటీఎం నిర్వహణ కోసం మామిడి తోరణాలతో సిద్ధం చేస్తున్న మందిరం

అనకాపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): **జిల్లాలో వివిధ రకాల ప్రభుత్వ యాజమానాల పరిధిలో వున్న పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో శుక్రవారం 'మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ (పీటీఎం-3.0) నిర్వహించనున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని విద్యా సంస్థల్లో గురువారం సాయంత్రానికి ఏర్పాట్లు పూర్తిచేశారు.**

జిల్లాలో 1,183 ప్రాథమిక పాఠశాలలు, 232 ప్రాథమికోన్నత పాఠశాలలు, 449 ఉన్నత పాఠశాలలు, 107 హయ్యర్ సెకండరీ స్కూల్స్.. మొత్తం 1,971 పాఠశాలలు వున్నాయి. ఇంకా 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు వున్నాయి. వీటిల్లో మొత్తం 2,07,370 మంది చదువుకుంటున్నారు. ప్రతి విద్యా సంస్థలో శుక్రవారం మెగా పీటీఎం-3.0 సమావేశాలు జరపనున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, విద్యా శాఖాధికారులు పాల్గొంటారు. పీటీఎం-3.0కు హాజరు కావాలంటూ విద్యాశాఖాధికారులు ఇప్పటికే విద్యార్థుల తల్లిదండ్రులకు ఆహ్వానాలు పంపారు. ఉదయం 9.30 గంటలకు ఆయా విద్యా సంస్థల ముఖద్వారాల వద్ద తల్లిదండ్రులు, ఇతర అతిథులకు ఉపాధ్యాయులు, విద్యార్థులు స్వాగతం పలుకుతారు. అనంతరం పాఠశాల అభివృద్ధి ప్రణాళికపై చర్చించేందుకు సమావేశం నిర్వహించి తల్లిదండ్రుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరిస్తారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల పరికరాలను ప్రదర్శిస్తారు. క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించి, మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేస్తారు. రాజకీయాలకు అతీతంగా నిర్వహించే ఈ సమావేశాల్లో విద్యార్థుల తల్లిదండ్రులంతా పాల్గొనాలని జిల్లా విద్యా శాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు ఒక ప్రకటనలో కోరారు.

మద్యం షాపులకు బెల్టు దెబ్బ

- అధికారిక షాపుల్లో లిక్కర్ అమ్మకాలపై ప్రభావం
- గిట్టుబాటు కావడంలేదని చేతులెత్తేస్తున్న వ్యాపారులు
- ఎక్సైజ్ అధికారులకు లైసెన్సులు అప్పగింత
- పరవాడ మండలంలో ఇప్పటికే ఐదు షాపులు మూసివేత

చోడవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మద్యం బెల్టు దుకాణాలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపడంతో ఆ ప్రభావం మద్యం దుకాణాలపై పడుతున్నది. వైన్ షాపులకు అనుబంధంగా పర్మిట్ రూమ్‌లకు అనుమతులు ఇచ్చినప్పటికీ.. బెల్ట్ షాపులు లేకపోవడంతో అనుకున్న మేర మద్యం అమ్మకాలు సాగడంలేదని వ్యాపారులు వాపోతున్నారు. మద్యం అమ్మకాల ద్వారా వచ్చే లాభాలతోపోలిస్తే.. లైసెన్స్ ఫీజు, షాపుల నిర్వహణ ఖర్చులు, అద్దెలు, సిబ్బంది జీతాలు అధికంగా వుంటున్నాయని, ఈ కారణంగా మద్యం షాపులను మూసివేసి, లైసెన్సులను వెనక్కు ఇచ్చేయాలని నిర్ణయించుకున్నట్టు చెబుతున్నారు. ఇప్పటికే పరవాడ మండలంలో ఐదు మద్యం షాపులు, చీడికాడ, పాయకరావుపేట మండలాల్లో ఒక్కో షాపు ఇప్పటికే మూతపడ్డాయి. తాజాగా చోడవరం మండలం గవరవరంలో మద్యం దుకాణాన్ని నిర్వహించలేమంటూ లైసెన్సును ఎక్సైజ్ అధికారులకు సరెండర్ చేశారు.

మద్యం దుకాణాల లైసెన్సు పొందిన వారిలో ఎక్కువశాతం మంది గ్రామీణప్రాంతంలో మద్యం అమ్మకాలపై ఒక అంచనా లేకుండా వ్యాపారంలోకి దిగారు. శివారు గ్రామాల్లో సైతం లైసెన్సు ఫీజు రూ.71 లక్షలు చెల్లించి మరీ దుకాణాలు ఏర్పాటు చేశారు. అంతకుముందు లైసెన్సు పొందడానికి ఒక్కో దరఖాస్తుకు రూ.2 లక్షల చొప్పున చెల్లించారు. మద్యం షాపును కచ్చితంగా దక్కించుకోవాలన్న ఉద్దేశంతో పలువురు ఒక్కో దుకాణానికి ఐదు నుంచి పది వరకు దరఖాస్తు చేశారు. దీంతో దరఖాస్తు ఫీజుకు కనీసం రూ.10 లక్షలు ఖర్చు చేశారు. ఇందులో ఒక్క రూపాయి కూడా తిరిగి రాదు. ఇక లాటరీ ద్వారా ... మిగతా 8వ పేజీలో



గవరవరంలో మూతపడనున్న మద్యం దుకాణం

గొలుసు దుకాణాలపై ఎక్సైజ్ శాఖ ఉక్కుపాదం



చీడికాడ మండలం తురువోలులో మూసివేసిన మద్యం దుకాణం

దట్టంగా పొగమంచు



కృష్ణాదేవిపేటలో దట్టంగా కురుస్తున్న మంచు

కృష్ణాదేవిపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మైదాన ప్రాంతంలో గురువారం తెల్లవారు జాము నుంచి ఉదయం ఎనిమిది గంటల వరకు పొగమంచు దట్టంగా కమ్ముకున్నది. దీనికితోడు చలితీవ్రత పెరిగింది. మంచు కారణంగా వాహన దారులు హెడ్‌లైట్లు వేసుకుని ప్రయాణం చాల్సి వచ్చింది. పొలం పనులను ఒకింత ఆలస్యంగా మొదలుపెట్టాల్సి వచ్చిందని రైతులు చెబుతున్నారు.

మంత్రి నారా లోకేశ్‌కు ఘన స్వాగతం



విమానాశ్రయం నుంచి బయటకు వస్తూ టీడీపీ నేతలకు నమస్కరిస్తున్న మంత్రి నారా లోకేశ్. చిత్రంలో ఎమ్మెల్యేలు బండారు, కావలి గ్రీష్మ, సీనియర్ నేత దాడి వీరభద్రరావు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి తదితరులు వున్నారు. -8లో

అరట్లకోటలో ఎన్‌ఎస్‌ఎస్ సేవా శిబిరం

పాయకరావుపేట రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరట్లకోట గ్రామంలో గురువారం స్పెసెస్ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో ప్రత్యేక సేవా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ అప్పలనర్స కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి యువతీ యువకులు తమ వంతు కృషి చేయాలన్నారు. సర్పంచ్ అప్పలనర్స మాట్లాడుతూ యువత పెడదారిన పడకుండా మంచి మార్గంలో పయనించి సమాజ హితానికి పాటు పడాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కట్టా శ్రీను, తూము రమణ, వేముల వెంకటేశ్వరరావు, తుమ్మల గణేశ్, డి. రాజేశ్‌ఖన్నా, పంచాయతీ కార్యదర్శి రమేశ్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి. భాస్కరరావు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి అమ్మవారికి మార్గశిర పూజలు

మునగపాక, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కనకమహాలక్ష్మి అమ్మవారికి గురువారం మార్గశిర మాసం పూజలు నిర్వహించారు. స్థానిక ఇందిరమ్మ కాలనీకి చెందిన పోల వరపు నారాయణరావు, నాగమణి దంపతులు ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించిన అనంతరం పెద్ద మదుం ఆటోస్టాండ్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

మండల సర్వసభ్య సమావేశం రేపు

అచ్యుతాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం జరుగుతుందని ఎంపీడీఓ బి. చిన్నారావు తెలిపారు. ఉదయం పదిన్నర గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, దీనికి అన్ని శాఖల అధికారులు, సభ్యులు హాజరవాలని ఆయన కోరారు.

మహాసభలను జయప్రదం చేయండి

▸▸ సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరరావు

అచ్యుతాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈనెల 31 నుంచి విశాఖపట్నంలో జరిగి సీఐటీయూ అఖిల భారత 18వ మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జి కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం అచ్యుతాపురంలో జరిగిన జీపుజాతా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సీఐటీయూ ఏర్పడిన తర్వాత తొలిసారిగా విశాఖపట్నంలో మహాసభలు జరుగుతున్నాయని, వీటిని విజయవంతం చేయాలని కోరారు. కేరళ ముఖ్యమంత్రి విజయన్‌తో పాటు ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో రొంగలి రాము, కర్రి అప్పారావు, కె.సోమునాయుడు, గుంటూరు శ్రీను, అప్పారావు, దుర్గ, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఉచిత వైద్యాన్ని దూరం చేయవద్దు

▸▸ మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు

పాయకరావుపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో వైద్య విద్యను వ్యాపారం చేసి సామాన్య ప్రజలకు ఉచిత వైద్యాన్ని దూరం చేయవద్దని మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గురువారం స్థానిక వైఎస్‌ఆర్ విగ్రహం వద్ద ప్రజల నుంచి సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యం పట్ల నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తోందన్నారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావు, జడ్పీటీసీ సభ్యులు లంక సూరిబాబు, వైసీపీ మండల అధ్యక్షుడు గెడ్డమూరి శ్రీనివాసరావు, పట్టణ పార్టీ అధ్యక్షులు ధనిశెట్టి బాబి, వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి సుందరలత, నాయకులు ధనిశెట్టి బాబూరావు, ఇసరపు తాతారావు పాల్గొన్నారు.

ఘనంగా దత్తాత్రేయస్వామి జన్మదిన వేడుకలు

రాంబిల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దిమిలి శ్రీదేవి, భూదేవీ సమేత వల్లభనారాయణస్వామి ఆలయంలో గురువారం దత్తాత్రేయస్వామి జన్మదిన వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు నేతేటి గోపాలకృష్ణ, ప్రముఖ పండితులు రామచంద్రాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

చిరు వ్యాపారులను ఆదుకోవాలని వినతి

అచ్యుతాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి):అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు విస్తరణలో ఉపాధి కోల్పోతున్న చిరు వ్యాపారులను ఆదుకోవాలని మంత్రి లోకేశ్‌ని కోరినట్టు టీడీపీ నాయకుడు కాండ్రేగుల వెంకటరమణ తెలిపారు. గురువారం విశాఖపట్నం విమానాశ్రయంలో నారా లోకేశ్‌ని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు విస్తరణ కారణంగా రోడ్డు పక్క చిరు వ్యాపారులు, తోపుడు బండ్లు, చేతివృత్తుల వారు నష్టపోతున్నారని, నిర్మాణాలకు పరిహారం ఇస్తున్నారు కాని చిరు వ్యాపారులు, కుమ్మరి వంటి కుల వృత్తుల వారికి ఎటువంటి పరిహారం ఇవ్వలేదన్నారు. వీరిని ఆదుకోవాలని తాను వినతిపత్రం ద్వారా కోరానని, దీనికి ఆయన సానుకూలంగా స్పందించారని వెంకటరమణ తెలిపారు

దివ్యాంగుల సంక్షేమమే ధ్యేయం : పప్పల



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు

అచ్యుతాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి):దివ్యాంగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు అన్నారు. గురువారం మోసయ్యపేటలో గల ఇంటిగ్రేటెడ్ దివ్యాంగుల ఆశ్రమ పాఠశాలలో నిర్వహిస్తున్న వారోత్సవాల్లో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం దివ్యాంగులు అన్ని రంగాల్లో ఎదిగే విధంగా ప్రత్యేక పథకాలను రూపొందించారన్నారు. బాపట్లలో దివ్యాంగులకు ప్రత్యేకంగా డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయనున్నారన్నారు. రాజధాని అమరావతిలో దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా భవనాన్ని నిర్మిస్తోందన్నారు. అంధ క్రికెటర్లు ప్రపంచకప్ నెగ్గడంతో దివ్యాంగులు ఎందులోనూ తీసిపోరని నిరూపించారన్నారు. ఈ సందర్భంగా పాఠశాల వ్యవస్థాపకులు వీఎస్‌టీ పట్నాయక్‌ని ఆయన సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పీలా తులసీరామ్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మామిడి శివఅప్పారావు, దుప్పితూరు పీఏసీఎస్ చైర్‌పర్సన్ దేశంశెట్టి వెంకటరమణ, నాయకులు కాండ్రేగుల అప్పారావు, పుర్రే శ్రీనివాస యాదవ్, పతివాడ చిన్నయ్యనాయుడు, లాలం నాగేశ్వరరావు, రాజాన రామునాయుడు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గం

పాయకరావుపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ పాయకరావుపేట మండల నూతన కార్యవర్గం గురువారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. పట్టణంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి మండల అధ్యక్షుడు కె.రామచంద్రమూర్తి అధ్యక్షత వహించగా.. జిల్లా గౌరవాధ్యక్షుడు పి.వెంకట్రావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన యూటీఎఫ్ మండల కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షులుగా కేఎస్ ఆర్‌కే. రాజు, ప్రధానకార్యదర్శిగా కట్టా లోవరాజు, గౌరవాధ్యక్షునిగా కె.శ్రీనివాసులు, అసోసియేట్ అధ్యక్షులుగా ప్రసూనాంబ, కట్టా శ్రీను, మండల కార్యదర్శులుగా జె.చినబాబు, వై.చంద్రశేఖర్, ఎం.నాగరాజు, జీవీ.ప్రసాద్, ఎం.అపర్ణ, ఎంవీ.నాగేశ్వరరావు, ఎంటీ.ఫణికుమార్, కేవీవీ.రామారావు, జిల్లా కౌన్సిలర్లు, సీపీఎస్ కమిటీ, ఆడిట్ కమిటీ, సాంస్కృతిక విభాగం, ప్రచార విభాగం కన్వీనర్లు, మహిళా విభాగం కార్యదర్శి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రండి..రండి.. దయచేయండి

▸▸ బడిలో పండుగ వాతావరణం

▸▸ తల్లిదండ్రులకు ప్రత్యేక ఆహ్వానాలు

▸▸ నేడు మెగా పేరెంట్, టీచర్స్ సమావేశం

నక్కపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల ఉన్నతికి ఉపాధ్యాయులే కాకుండా విద్యార్థుల తల్లిదండ్రుల భాగస్వామ్యం కూడా వుండాలని ఎన్‌డీఏ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ప్రతి ఏటా మెగా పేరెంట్స్ కమిటీ సమావేశాలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తోంది. ఈనెల 5న శుక్రవారం మెగా పేరెంట్స్ కమిటీ సమావేశాలకు స్కూళ్లు సిద్ధమయ్యాయి. అన్ని పాఠశాలల్లో పండుగ వాతావరణం వుండాలని ప్రభుత్వం ఆదేశించింది. గురువారం సాయంత్రానికే పాఠశాలల్లో పేరెంట్స్ కమిటీ సమావేశానికి అవసరమైన ఏర్పాట్లు ఉపాధ్యాయులు చేపట్టారు. ఈ సమావేశాలకు హాజరై విజయవంతం చేయాలంటూ నేరుగా పిల్లల తల్లిదండ్రులకే ఉపాధ్యాయులు ఆహ్వానాలు పంపారు. మరికొందరికి ఫోన్ల ద్వారా సమాచారం అందజేశారు. మండలంలో ఏర్పాట్లను గురువారం ఎంఈవోలు కె.నరేశ్, నాగన్నదొర పరిశీలించారు. మండలంలో 76 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలతో పాటు గురుకులం, జూ.కళాశాలల్లో మెగా పేరెంట్స్ కమిటీ సమావేశాలు జరగనున్నాయి.తల్లిదండ్రులకు విద్యార్థులే ఘనస్వాగతం పలికేలా పలు పాఠశాలల్లో స్వాగత బోర్డులు ఏర్పాటు చేశారు. పెదబోదిగల్లం, నక్కపల్లి, గొడిచెర్ల, చినదొడ్డిగల్లు, వేంపాడు, ఉద్దండపురం జడ్పీ హైస్కూళ్లను మామిడి కొమ్మలు, పుష్పమాలలతో అలంకరించారు. పేరెంట్స్ కమిటీ అనంతరం ఉపాధ్యాయులే పిల్లల ప్రగతిపై ప్రోగ్రెస్ రిపోర్ట్‌లు కూడా అందజేయనున్నారు. పలు రంగాల్లో నైపుణ్యత వున్న పిల్లలతో ప్రదర్శనలు వుంటాయి. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులంతా కలిపి సహపంక్తి భోజనాలు చేస్తారు.

ఎలమంచిలిలో..

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించతలపెట్టిన మెగా పీటీఎం నిర్వహించేందుకు నియోజకవర్గంలోని అన్ని విద్యాసంస్థలను సిద్ధం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మెగా పీటీఎంలను శుక్రవారం ఉత్సాహభరితమైన వాతావరణంలో నిర్వహించేలా ఇప్పటికే అన్ని విద్యాసంస్థలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఇప్పటికే విద్యార్థుల తల్లిదండ్రులకు ఆహ్వానాలు పంపారు. పాఠశాలలో విద్యా ప్రమాణాలు, విద్యాలయాల పురోగతి, సమస్యలు, రానున్న పదో తరగతి వార్షిక పరీక్షల సన్నద్ధత, వంద రోజుల ప్రణాళిక, తదితర అంశాలపై చర్చించడం జరుగుతుంది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సమావేశం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అందరూ కలిసి అక్కడే మధ్యాహ్న భోజనం చేసేలా ఏర్పాట్లు చేశారు.



నక్కపల్లి గురుకులంలో పూలతో అలంకరణ చేస్తున్న టీచర్లు,విద్యార్థినులు

కోటవురట్లలో..

మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో శుక్రవారం మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంఈవో రామారావు తెలిపారు. విద్యార్థుల స్థాయి, తరగతి గదిలో ప్రవర్తన, వారి భవిష్యత్తుకు ఏమి చేస్తే బాగుంటుంది తదితర విషయాలపై చర్చించనున్నట్టు చెప్పారు. మండలంలో ఐదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలు, యూపీ స్కూల్, ఎంపీపీ స్కూళ్లలో ఉదయం 9గంటలకు పేరెంట్స్ మీటింగ్ ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

అచ్యుతాపురం జంక్షన్‌లో వాహనాలకు బ్రేక్

ముమ్మరంగా ఫ్లైఓవర్ పనులు.. వాహన చోదకుల ఇక్కట్లు

అచ్యుతాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం జంక్షన్‌లో ఫ్లైఓవర్ పనులు ముమ్మరంగా జరుగుతుండడంతో ట్రాఫిక్‌ని పూర్తిగా నిలిపివేశారు. అచ్యుతాపురం జంక్షన్ నుంచి పూడిమడక రోడ్డులో గల భోగాపురం రోడ్డు మధ్య 500 మీటర్ల మేర వాహన రాకపోకలు జరగకుండా నిరోధించారు. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గాజువాక, అనకాపల్లి నుంచి వచ్చే తేలికపాటి వాహనాలను ఎలమంచిలి రోడ్డులో గల అయ్యప్పస్వామి ఆలయం ఎదురుగా గల మార్టూరు రోడ్డు మీదుగా మళ్లించారు. భారీ వాహనాలు మాత్రం రాంబిల్లి మండల వెంకటాపురం జంక్షన్, సెజ్ పునరావాస కాలనీ, దిబ్బపాలెం మీదుగా మళ్లించారు. దీనివల్ల అచ్యుతాపురం జంక్షన్ నుంచి పూడిమడక వైపు వెళ్లే వాహనాలు అదనంగా ఎనిమిది కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తోంది. దీంతో ద్విచక్రవాహనాలు, కార్లు చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే పూడిమడక రోడ్డులో గల భోగాపురం రోడ్డులో గల స్టేట్ బ్యాంకు మీదుగా వెంకటేశ్వరస్వామి ఆలయం పక్క నుంచి గాజువాక రోడ్డుకి ట్రాఫిక్‌ని మళ్లిస్తే ప్రయాణికులకు ఇబ్బందులు తీరుతాయని ఈప్రాంతీయులు



అచ్యుతాపురం జంక్షన్‌లో రాకపోకలు నిలిపివేసిన దృశ్యం

కోరుతున్నారు.

అలాగే అచ్యుతాపురం జంక్షన్ నుంచి భోగాపురం వరకు రాకపోకలు నిరోధించడంతో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యాపార సంస్థలన్నీ ఈ పరిధిలోనే అధికంగా ఉన్నాయి. దీంతో వ్యాపారాలు జరగడం లేదని వ్యాపారులు వాపోతు న్నారు. మరో రెండు నెలల వరకు ఈ పరిస్థితి ఉంటుందని రోడ్డు నిర్మాణదారులు చెబుతున్నారని, అంతవరకు రోడ్డు మూసేస్తే తీవ్ర ఇబ్బందులు పడతామని అంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కనకమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు



ధర్మవరంలోని కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ఎలమంచిలి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ధర్మవరంలో కొలవైన కనకమహాలక్ష్మి ఆలయానికి గురువారం తెల్లవారు నుంచి భక్తులు పోటెత్తారు. మార్గశిర మాసం గురువారం తొలిపూజ కార్యక్రమాన్ని బండారు గీతా రమేశ్ కుటుంబ సభ్యులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు స్థానికులతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంతమంతా కిటకిటలాడింది. ఆలయ కమిటీ చైర్మన్ కొఠారు సాంబ, ప్రతినిధుల ఆధ్వర్యంలో భక్తులకు అన్ని సదుపాయాలు కల్పించారు. ఉదయం నుంచి అమ్మవారికి అభిషేకాలు, మహిళలు క్షీరాభిషేకం చేసి తమ మొక్కులు తీర్చుకున్నారు. శుక్రవారం ఆలయ ఆవరణలో లక్ష కుంకుమార్చన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు కమిటీ చైర్మన్ కొఠారు సాంబ తెలిపారు.

ఆక్రమణలపై హోం మంత్రి ఆదేశాలతో కదిలిన యంత్రాంగం

పాయకరావుపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మెయిన్ రోడ్డును ఆనుకుని ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆదేశాలతో అధికార యంత్రాంగం కదిలింది. గురువారం తహశీల్దారు మహేశ్వరరావు ఆధ్వర్యంలో పంచాయతీ, పీహెచ్‌సీ అధికారులు ప్రహరీని ఆనుకుని ఆక్రమణలను పరిశీలించారు. దుకాణాలను వెంటనే తొలగించాలని ఆక్రమణదారులను ఆదేశించారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ ఆక్రమణదారులు ఏర్పాటుచేసిన బడ్డీలు, ఇతర కట్టడాలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని ఆదేశించామని, లేకుంటే తామే ఆక్రమణలు తొలగింపు చర్యలు చేపడతామని హెచ్చరించామన్నారు. దుకాణాలకు విద్యుత్ శాఖ ఇచ్చిన కనెక్షన్లు తొలగించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీఎంపీడీఓ కె.డేవిడ్, పీహెచ్‌సీ డాక్టర్ సుభాష్ పాల్గొన్నారు.

ఆక్రమణదారులకు నోటీసులు

పట్టణంలోని పీహెచ్‌సీ ఎదుట రోడ్డును ఆక్రమించి ఏర్పాటుచేసిన దుకాణాలను వెంటనే తొలగించాలని ఆక్రమణదారులకు గురువారం పోలీసులు నోటీసులు జారీచేశారు. ఇందుకు సంబంధించి సీఐ జి.అప్పన్న విలేకర్లతో



పీహెచ్‌సీ ప్రహరీని ఆనుకుని ఉన్న ఆక్రమణలను పరిశీలిస్తున్న అధికారులు

మాట్లాడుతూ పీహెచ్‌సీ ప్రహరీగోడను ఆనుకుని దుకాణాలు ఏర్పాటు చేయడం వలన రోగులకు, అంబులెన్స్‌లకు ఇబ్బంది కలుగుతున్నదని పీహెచ్‌సీ వైద్యాధికారి ఫిర్యాదు చేశారన్నారు. అంతేకాకుండా తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని, అందువల్ల దుకాణాలను తొలగించాలని యజమానులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇదే విషయాన్ని తహసీల్దారుతో పాటు వీఎంఆర్డీఏ అధికారులకు తెలియజేశామని సీఐ తెలిపారు.

ఆమరణ నిరాహార దీక్ష విరమణ

యువకులతో రెండు గంటల పాటు చర్చలు జరిపిన అధికారులు

సర్వే చేసిన అనంతరం విచారణ చేపడతామని హామీ

ఎలమంచిలి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి):మునిసిపాలిటీ పెదపల్లిలో చెరువు స్థలం పరిరక్షణ కోసం మూడు రోజులుగా యువకులు చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష గురువారంతో ముగిసింది. బుధవారం రాత్రి ఆర్డీఓ ఆయేషా, డీఎస్పీ విష్ణుస్వరూప్, చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి ఆమరణ నిరాహార దీక్షా శిబిరాన్ని సందర్శించి, యువకులతో దీక్ష విరమించాలని కోరారు. గ్రామ పెద్దలు, యువకులతో రెండు గంటలు పాటు అధికారులు చర్చలు జరిపారు. గ్రామంలో ఉన్న చెరువు స్థలాన్ని సర్వే చేయిస్తామని, అనంతరం విచారణ చేపడతామని అధికారులు తెలపడంతో దీక్షను విరమించేందుకు యువకులు అంగీకరించారు. చైర్‌పర్సన్ రమాకుమారి దీక్ష చేపట్టిన యువకులకు నిమ్మరసం ఇచ్చారు. అంతకుముందు దీక్ష చేపట్టిన యువకులకు వైద్య



యువకులతో మాట్లాడుతున్న ఆర్డీఓ ఆయేషా, అధికారులు

పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజలు, పోలీసులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలి

ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

అచ్యుతాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక ఏపీఐఐసీ కార్యాలయంలో నియోజకవర్గ అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అవసరమైనే అదనపు మ్యాన్‌పవర్‌ని వినియోగించి రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలన్నారు. రోడ్డు నిర్మాణం పనులు పూర్తయ్యే వరకు రోజువారి పనుల నివేదికను తయారుచేసుకోవాలన్నారు. ట్రాఫిక్‌కి అంతరాయం కలుగకుండా ప్రతి సర్కిల్‌లో వాహన రాకపోకల మార్గాన్ని బోర్డుల ద్వారా సూచించాలన్నారు.

అచ్యుతాపురంలో జరుగుతున్న అండర్ విద్యుత్‌లైన్ల పనులు పురోగతిని అడిగి తెలుసుకున్నారు. రోడ్డు విస్తరణలకు భూములిచ్చేవారికి టీడీఆర్ బాండ్లు త్వరితగతిన అందేలా చర్యలు చేపట్టాలన్నారు. నాలుగు మండలాల తహశీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

సచివాలయాలను అనాథలను చేసిన వైసీపీ

ఎమ్మెల్యే విజయకుమార్.. భవనాలు లేక బడి, కమ్యూనిటీ భవనాల్లో ఏర్పాటు

మునగపాక, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) :వైసీపీ ప్రభుత్వం రోడ్లు, అవసరమైన భవన నిర్మాణాలను పూర్తిగా విస్మరించిందని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ విమర్శించారు. గురువారం కాకరాపల్లిలో రూ.32లక్షలతో నిర్మించనున్న పంచాయతీ భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం సచివాలయాలను పూర్తిగా విస్మరించిందన్నారు. అందుబాటులో ఉన్న బడి, కమ్యూనిటీ వంటి ఖాళీ భవనాల నుంచి పాలన మొదలు పెట్టారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్లు, అవసరమైన కార్యాలయాలకు భవనాలను నిర్మిస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొల్లి ముసిలినాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు ఇల్ల శిరీషా, కూటమి నాయకులు టెక్కలి పరశురాం, పాలిపిని శ్రీనివాసరావు, దొడ్డి శ్రీను, దాడి ముసిలినాయుడు పాల్గొన్నారు.



కాకరాపల్లిలో పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే విజయకుమార్

మంగవరంలో రోడ్డు పక్క చెత్త తొలగింపు

పాయకరావుపేట రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగవరం గ్రామ శివారులో రోడ్డు పక్కన వేసిన చెత్త, చెదారాన్ని గురువారం అధికారులు తొలగించారు. మంగవరం శివారులో రోడ్డు పక్క చెత్తా, చెదారాన్ని వేసి డంపింగ్ యార్డుగా వినియోగిస్తున్నారని 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. చెత్తను తొలగించడానికి చర్యలు తీసుకున్నారు. గురువారం పంచాయతీ కార్యదర్శి కొండారావు దగ్గరుండి చెత్తను తొలగించారు.

రాంబిల్లిని అనకాపల్లి డివిజన్‌లోనే కొనసాగించాలి : ధర్మశ్రీ

రాంబిల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి):రాంబిల్లి మండలాన్ని అనకాపల్లి రెవెన్యూ డివిజన్‌లోనే కొనసాగించాలని, లేకుంటే ఎలమంచిలి కేంద్రంగా కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. గురువారం ఆయన తహశీల్దార్ కార్యాలయం వద్ద వైసీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నిరసన తెలిపిన అనంతరం ఆర్‌ఐకి ఆయన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ రాంబిల్లి మండల ప్రజలకు, రైతులకు అనకాపల్లి డివిజన్ నుంచి మంచిగా సేవలు అందుతున్నాయన్నారు. ప్రభుత్వం నక్కపల్లి డివిజన్‌లో రాంబిల్లి మండలాన్ని కలపడం వలన ప్రజలు అన్నిరకాలుగా ఇబ్బందులు పడే పరిస్థితి ఉందన్నారు. కార్యక్రమంలో జడ్‌పీటీసీ సభ్యుడు ధూళి నాగరాజు, వైసీపీ మండల అధ్యక్షుడు పి.కిశోర్, మాజీ అధ్యక్షుడు జి.శ్రీనుబాబు,తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలకు సద్వినియోగం చేసుకోవాలి

ఎస్.రాయవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : భూములను మరింత సారవంతంగా చేసుకునేందుకు రైతులు భూసార పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం అన్నారు. గురువారం మండలంలోని ఉప్పరపల్లి, సైతారుపేటల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సాయిల్ హెల్త్ కార్డుల ఉపయోగాలపై నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. భూసార పరీక్షలతో పాటు పచ్చిరొట్ట ఎరువులు వాడుకోవడం ద్వారా భూములను సారవంతంగా చేసుకోవచ్చునన్నారు. కొక్కిరాపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్ర శాస్త్రవేత్త డాక్టర్ ఏబీఎం.శిరీష, మండల ఏఓ సౌజన్య, జిల్లా వనరుల కేంద్రం ఏఓ విజేత మాట్లాడుతూ సాయిల్ టెస్టింగ్‌కి మట్టి నమూనాలు ఎలా సేకరించాలి.. ఎరువులు ఎంత వేయాలి.. తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీరాములు, పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జి తుమ్మపాల నాగేశ్వరరావు, రైతులు వీసం అప్పలస్వామినాయుడు పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన

ఎలమంచిలి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కొత్త చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని, డ్రైవర్లు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్‌ఐలు రామకృష్ణ, సావిత్రి అన్నారు. గురువారం పోతిరెడ్డిపాలెం జంక్షన్ సమీపంలో డ్రైవర్లకు ట్రాఫిక్ ఎస్‌ఐ రామకృష్ణ ట్రాఫిక్ నిబంధనలు అమలు తీరుపై సూచనలు అందించారు.

ఘనంగా ఏనుగు కొండ ప్రదక్షిణ

అచ్యుతాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎం. జగన్నాథపురంలో గల ఏనుగు కొండ ప్రదక్షిణ గురువారం రాత్రి నిర్వహించారు. రాత్రి ఏడు గంటలకు కొండ మీద ఉన్న దుర్గాదేవి ఆలయం నుంచి గిరి ప్రదక్షిణ ప్రారంభమైంది. కొండ దిగువన భ్రమరాంబ సహిత మల్లికార్జునస్వామి ఆలయం, కొండ వెనుక వేంకటేశ్వరస్వామి ఆలయాలను దర్శించుకొని తిరిగి కొండ మీద గల దుర్గమ్మని దర్శించుకోవడంతో గిరి ప్రదక్షిణ ముగిసింది. ప్రతి సంవత్సరం మార్గశిర మాసంలో రెండో గురువారం ఈ గిరి ప్రదక్షిణ జరపడం ఆనవాయితీగా వస్తోంది. ఎంజేపురంతో పాటు చుట్టుపక్కల గ్రామస్థులు ఈ ప్రదక్షిణలో పాల్గొన్నారు. రాత్రి కావడంతో కాగడాల వెలుగులో భక్తులు హరిహర నామ స్మరణ చేస్తూ ప్రదక్షిణ చేశారు.

8 మద్యం సీసాలు స్వాధీనం

పాయకరావుపేట రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగవరం గ్రామ శివారులో దాడులు నిర్వహించి అక్రమంగా తరలిస్తున్న 8 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని ఒకరిని అదుపులోకి తీసుకున్నట్టు సీఐ జి.అప్పన్న తెలిపారు. అందిన సమాచారం మేరకు గురువారం సాయంత్రం ఏఎస్‌ఐ నాయుడు పోలీసు సిబ్బందితో మంగవరం గ్రామ శివారుకు వెళ్లగా ఒక వ్యక్తి వీరిని చూసి పారిపోయేందుకు ప్రయత్నించాడు. అతనిని పట్టుకుని పరిశీలించగా 8 మద్యం బాటిళ్లు దొరికాయి. కేసు నమోదు చేసి అతనిని అదుపులోకి తీసుకున్నట్టు సీఐ తెలిపారు.

ఘనంగా దత్తాత్రేయ జయంతి

ఎస్.రాయవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దత్తాత్రేయ జయంతి సందర్భంగా గురువారం రేవుపోలవరం షిర్డీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా ఆలయంతో పాటు ఆవరణలో ఉన్న దత్తాత్రేయ ఆలయంలో అర్చకులు విశేష పూజలు చేశారు. అదేవిధంగా విష్ణు సహస్రనామం, లలితా సహస్రనామ పారాయణం, సాయిబాబా హారతి, భజన కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తరించారు.

'పేట' లాడ్జిల్లో పోలీసుల తనిఖీలు

పాయకరావుపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు లాడ్జిల్లో గురువారం రాత్రి పోలీసులు విస్తృతంగా తనిఖీచేశారు. ఇందుకు సంబంధించి సీఐ జి.అప్పన్న విలేకర్లతో మాట్లాడుతూ గురువారం రాత్రి పలు లాడ్జీల్లో సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించామన్నారు. లాడ్జీల్లో రికార్డులు పరిశీలించడంతో పాటు పేకాటలు, అసాంఘిక కార్యకలాపాలకు ఇస్తున్నారా అన్నదానిపై పరిశీలించామన్నారు. అదేవిధంగా అనుమానితులు, గంజాయి నిందితులు ఉన్నారా, ఓపెన్ డ్రింకింగ్ ఏమైనా జరుగుతున్నదా అన్న కోణంలో ప్రతి లాడ్జిని క్షుణ్ణంగా పరిశీలించామని ఆయన తెలిపారు.

పీహెచ్‌సీ వైద్యులకు షోకాజ్ నోటీసులు

పాయకరావుపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పాయకరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులకు గురువారం జిల్లా అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత బుధవారం పట్టణంలోని పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో ఆసుపత్రిలో ఇద్దరు వైద్యులు అందుబాటులో లేకపోవడంతో పాటు నర్సు యూనిఫారమ్ వేసుకోకపోవడం, ఆసుపత్రి ఆవరణ అపరిశుభ్రంగా ఉండడాన్ని గుర్తించి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. దీనిపై హోం మంత్రి డీఎంహెచ్‌ఓకి ఫోన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు బాధ్యులకు షోకాజ్ నోటీసులు జారీచేయాలని ఆదేశించారు. దీంతో పీహెచ్‌సీలోని ఇద్దరు వైద్యులతోపాటు నర్సుకి షోకాజ్ నోటీసులు గురువారం జారీ అయ్యాయి.

4 పంచాయతీలకు చెత్త సేకరణ రిక్షాలు

ఎలమంచిలి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి):ములకలాపల్లి షైహోమ్ సిమెంట్ పరిశ్రమ ప్రతినిధులు సీఎస్‌ఆర్ నిధులతో మండలంలోని నాలుగు పంచాయతీలకు చెత్త సేకరణకు రిక్షాలను గురువారం అందజేసినట్టు పరిశ్రమ యూనిట్ హెడ్ బి.రామస్వామి తెలిపారు. సుమారు లక్ష రూపాయల వ్యయంతో ములకలాపల్లి, మన్యంపాలెం, లక్కవరం, లైనుకొత్తూరు గ్రామ పంచాయతీలకు నాలుగు వాహనాలను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ సీనియర్ డీజీఎం(పీఅండ్‌ఏ)ఎల్.శ్రీనివాసరావు, సీఎస్‌ఓ, డి.వెంకట్రావు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

ఘనంగా నవదుర్గామాత జాతర

రాంబిల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి):మండలంలోకి కొట్టుబోలు గ్రామంలో గురువారం నవదుర్గామాత జాతర ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్థానికులే కాకుండా సమీప గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. తమ మొక్కులను చెల్లించుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం భవాని భక్తులు సూలాల మహోత్సవాన్ని నిర్వహించి, అమ్మవారి ప్రతిమను గ్రామంలో ఊరేగించారు. భవాని మాలధారకులు అగ్నిగుండంలో నడిచారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన టీడీపీ నేతలు



మంత్రి లోకేశ్‌ను కలిసిన బుద్ద నాగజగదీశ్వరరావు, దాడి వీరభద్రరావు

అనకాపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్‌ను జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు గురువారం విశాఖపట్నం విమానాశ్రయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రిని కలిసిన వారిలో మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, తదితరులు ఉన్నారు.

ఘనంగా మరిడిమాంబ నెల పండుగ

పరవాడ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలో వెన్నెలపాలెం ప్రజల ఆరాధ్య దేవత మరిడిమాంబ అమ్మవారి నెల పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము ఆరు గంటల నుంచి భక్తులు అమ్మవారి ఆలయం వద్ద బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని ముడుపులు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బండారు అప్పలనాయుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పైలా రథాల సన్యాసిరావు, స్థానిక నాయకులు వెన్నెల ఏకుల అప్పారావు, లోకిరెడ్డి అభి సన్యాసినాయుడు, వెన్నెల గిరి, బోజంకి నాయుడు, తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను గ్రామ వీధుల్లో ఊరేగించి ఆలయం వద్ద ఘనంగా అనుపోత్సవం నిర్వహించారు.

పాటల పోటీల విజేతలకు బహుమతులు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : ఘంటసాల జయంతిని స్థానిక జీవీఎంసీ బాలికోన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకులు బల్లా నాగభూషణం ఆధ్వర్యంలో ఘంటసాల చిత్రపటం వద్ద ప్రముఖ వైద్యులు బి.హెచ్.దక్షిణామూర్తి జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పాటల పోటీల్లో గెలుపొందిన ఎం.లక్ష్మీ లలితాంబ, డి. తేజస్విని, వి.వెన్నెలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను డాక్టర్ దక్షిణామూర్తి అందజేశారు. ప్రత్యేక బహుమతులను ఎ.కారుణ్య, కె.లావణ్య దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రుదిరరాణి, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

భవానీ భక్తుల శూలాల మహోత్సవం



శూలాలు ధరించిన భవాని భక్తులు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక భీమునిగుమ్మంలో భవానీ భక్తులు గురువారం రాత్రి కనకదుర్గమ్మ తల్లి సేవా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. నవదుర్గ సేవా సంఘం ఆధ్వర్యంలో భవాని మాలలు ధరించిన భక్తులు శూలాలు ధరించడంతో పాటు భారీ ఎత్తున అమ్మవారి ఘటాలను నెత్తిన పెట్టుకుని ఊరేగింపు నిర్వహించారు. భీమునిగుమ్మం జంక్షన్ నుంచి ప్రారంభమైన ఈ ఊరేగింపు పట్టణంలోని పలు ప్రాంతాల్లో సాగింది.

బాల్య వివాహ రహిత సమాజమే లక్ష్యం

సబ్బవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహ రహిత సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పిలుపునిచ్చారు. మండలంలోని రావలమ్మపాలెం గ్రామంలో బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ 100 రోజుల అవగాహన కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్‌కు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీవో లలితకుమారి, ఎంపీడీవో పి.పద్మజ, తహశీల్దార్ బి.చిన్నికృష్ణ, పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్‌ఐ అర్జున్ స్పష్టం చేశారు. స్థానిక శారదా బ్రిడ్జి వద్ద గురువారం రాత్రి విద్యార్థులకు నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలు, మోటార్ వాహన చట్టం నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. విద్యార్థులు నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే జరగరాని సంఘటనలు జరిగినప్పుడు బాధ్యులు మీ తల్లిదండ్రులే అవుతారని హెచ్చరించారు. అందువల్ల మేజర్లుగా అయ్యే వరకు ఎటువంటి వాహనాలను నడపకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన దాడుల్లో ఇద్దరు మైనర్లకు ట్రాఫిక్ సీఐ ఎం. వెంకటనారాయణ జరిమానా విధించారు.

ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి

» జడ్జీ చక్రవర్తి సూచన


అనకాపల్లి టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అనేక సదుపాయాలు కల్పిస్తున్నదని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె. చక్రవర్తి కోరారు. స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం మహిళలకు ఉచితంగా టైలరింగ్, ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్ కోర్సుల శిక్షణను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నెలల కోర్సు పూర్తయిన తరువాత స్కిల్‌మిషన్ ఆఫ్ ఇండియా ఇచ్చిన సర్టిఫికెట్ చాలా విలువైనదని, దాని ద్వారా సొంతంగా షాపులను పెట్టుకొని ప్రభుత్వ సబ్సిడీతో బ్యాంకు రుణాలు పొంది ఉపాధి పొందవచ్చన్నారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ క్లబ్ తరపున ఇది మూడవ బ్యాచ్ అని, 40 మంది మహిళలకు శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ సందర్భంగా అతిథులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ప్రకాశరావు, ఒకేషనల్ డైరెక్టర్ శ్రీహర్ష, ట్రైనర్ బుద్ద సత్యనారాయణ, పీజే నాయుడు, సానా త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీటికి విద్యార్థులు దూరం

» ప్రభుత్వ పాఠశాలల్లో మూలకు చేరిన ఆర్వో ప్లాంట్లు

» కొళాయి నీరు తాగాల్సిన దుస్థితి

» ఆర్వో ప్లాంట్లు నెలల తరబడి నిరుపయోగంగా ఉన్నా పట్టించుకోని అధికారులు



గవరపాలెం ఉన్నత పాఠశాలలో మూలకు చేరిన ఆర్వో ప్లాంట్

అనకాపల్లి టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించే ఆర్వో ప్లాంట్లు మూలకు చేరాయి. నెలల తరబడి ఈ ఆర్వో ప్లాంట్‌లు వినియోగంలో లేకపోవడంతో విద్యార్థులు స్వచ్ఛమైన తాగునీటికి దూరమవుతున్నారు. జీవీఎంసీ పరిధిలోని గవరపాలెం ఉన్నత పాఠశాలలో ఆరు నెలలకు పైగా ఆర్వో ప్లాంట్ మూలకు చేరింది. దీంతో ప్లాంట్ పరికరాలు దుమ్ము, దూళితో అధ్వానంగా కనిపిస్తున్నాయి. అలాగే గవరపాలెం బాలికోన్నత పాఠశాలలో సుమారు ఏడాదిగా ఆర్వో ప్లాంట్ పని చేయకపోవడంతో విద్యార్థులకు పరిశుభ్రమైన తాగునీరు అందని పరిస్థితి నెలకొంది. విద్యార్థి దశలోనే పిల్లలకు స్వచ్ఛమైన, పరిశుభ్రమైన తాగునీరు అందించాల్సి ఉంది. అయితే అధికారులు మూలకు చేరిన ఆర్వో ప్లాంట్‌లను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టకపోవడంతో కొళాయి నీటిని తాగాల్సి వస్తోంది. పలు దఫాలు ఉపాధ్యాయులు సొంత డబ్బులతో మరమ్మతులు చేయించినా తిరిగి అవి మొరాయించడంతో మూలకు చేరాయి. గవరపాలెం ఉన్నత పాఠశాలలో జీవీఎంసీ ట్యాంకర్ ద్వారా నీటిని ట్యాంకులోకి నింపుకొని వినియోగిస్తున్నట్టు తెలిసింది. బాలికోన్నత పాఠశాలలో మోటారు ద్వారా నీటిని వినియోగిస్తున్నారు. అయితే శుద్ధి చేయని నీరు తాగడంతో విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పరిశుభ్రమైన నీరు అందించాలని పలువురు కోరుతున్నారు.



గవరపాలెం బాలికోన్నత పాఠశాలలో పనిచేయని ఆర్వో ప్లాంట్

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

» ప్రాధాన్యతాక్రమంలో రెండేళ్లలో పరిష్కారం

» పని చేసే ప్రభుత్వాన్ని ప్రజలు గుర్తించాలి

» మన పల్లెకు- మన ఎమ్మెల్యే సభలో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు



ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబును సత్కరిస్తున్న బీజేపీ నేతలు చొక్కాకుల వెంకటరావు, గోవింద, తదితరులు, హాజరైన ప్రజలు

సబ్బవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రానున్న రెండేళ్లలో ప్రాధాన్యతాక్రమంలో ప్రతి సమస్యను పరిష్కరిస్తానని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. మండలంలోని రావలమ్మపాలెం, టిక్కులిపాలెం గ్రామాల్లో గురువారం నిర్వహించిన మన పల్లెకు- మన ఎమ్మెల్యే కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు రావలమ్మపాలెంలో కూటమి నేతలు ఘన స్వాగతం పలికారు. ముందుకు లా వర్సిటీ జంక్షన్(సబ్బవరం-చోడవరం రోడ్డు)నుంచి గుల్లేపల్లి రోడ్డును కలిపే బీటీ రోడ్డు నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరించారు. టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు మిడతాడ మహాలక్ష్మీనాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బీజేపీ నాయకులు చొక్కాకుల వెంకటరావు ముఖ్యమైన గ్రామ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. అంతకాపల్లి రెవెన్యూలో భూ సమస్యలు పెరిగిపోయాయని, ఎంతో కాలంగా రైతుల భూములు ఆన్‌లైన్‌కు నోచుకోలేదన్నారు. అదే విధంగా గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఆందోళనకర స్థితిలో ఉందని, వెంటనే మార్పించాలని కోరారు. రావలమ్మపాలెం బీసీ హాస్టల్ నుంచి జడ్పీ హైస్కూల్‌కు రాకపోకలు సాగించే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే బీటీ రోడ్డు మంజూరు చేయాలని కోరారు. అలాగే ఇతర సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతి వారం అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహిస్తున్నారన్నారు. ఏ సమస్య పరిష్కారం కాకపోయినా తీవ్రంగా స్పందిస్తున్నారన్నారు. అందుకే ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో పర్యటిస్తున్నట్టు చెప్పారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధితో పాటు వ్యక్తిగత సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానని చెప్పారు. కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేసి ప్రజల ముందుకు వస్తుందన్నారు. పని చేసే ప్రభుత్వాన్ని విజ్ఞతతో ప్రజలు గుర్తించాలని సూచించారు. అనంతరం బీజేపీ నేతలు చొక్కాకుల వెంకటరావు, లక్ష్మి, చొక్కాకుల గోవింద ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు రొంగలి దేముడుబాబు, శ్రీరాములమ్మ, ఇందలి రమణ, సాలాపు వెంకటేశ్వరరావు, బొండా సత్యారావు, కొటాన అప్పారావు, దొడ్డి ప్రకాశ్, గొంప నాయనప్ప, పైల రమణ, ఎస్. మనోహర్‌గాంధీ, ఎస్ రమణ, పల్ల రమణ, జక్కాన సూర్యనారాయణ, బిఏ రావు, కర్రి కనకరాజు, బి.పద్మ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

జూన్‌లో బదిలీ అయిన టీచర్లను రిలీవ్ చేయాలి

» యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి

అనకాపల్లి రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ ఏడాది జూన్‌లో బదిలీ అయి ఇంకా పాత పాఠశాలల్లో పనిచేస్తున్న 51 మంది హిందీ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి గొంది చినబ్బాయి గురువారం డీఈవో గిడ్డి అప్పారావునాయుడును కోరారు. ఈ మేరకు వినతిపత్రంలో అందజేశారు. ప్రభుత్వం నియమించే అడహాక్ ఇన్‌స్ట్రక్టర్లు రిలీవ్ కాకుండా ఉన్న హిందీ టీచర్ల స్థానంలో నియమించి సదరు హిందీ టీచర్లను బదిలీ పొందిన కొత్త ప్రదేశాలకు పంపాలన్నారు. పదవ తరగతి వంద రోజుల ప్రణాళికలో భాగంగా సెలవు దినాల్లో కూడా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని చెప్పడం సరికాదన్నారు. ఆ తరగతులను నిలుపుదల చేసి వాటిని పని దినాల్లో సర్దుబాటు చేయాలన్నారు. ఏకోపాధ్యాయ పాఠశాల ఉపాధ్యాయులు సెలవులు తీసుకునే విషయంలో ఇబ్బందులు పడుతున్నారని, పలు హైస్కూల్‌లో సబ్జెక్టు టీచర్లు కొరత ఉందని, వీటన్నింటిని పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శ్రీలక్ష్మి, సహ అధ్యక్షులు రొంగలి అక్కునాయుడు, అనకాపల్లి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘంటసాలకు ఘన నివాళి

పరవాడ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అలనాటి గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు ఆలపించిన సినీ గీతాలు నేటి యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. మండల కేంద్రం పరవాడలో గురువారం నిర్వహించిన ఘంటసాల జయంతి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత స్థానిక సంతబయలు వద్ద గల ఘంటసాల విగ్రహానికి ఆయన పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు పరవాడ జగదీశ్వరరావు, తదితరుల చేతుల మీదుగా ఎమ్మెల్యే రమేశ్‌బాబును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పైలా సన్యాసిరాజు, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పైలా శ్రీనివాసరావు, పరవాడ సర్పంచ్ శిరపురపు అప్పలనాయుడు, మాజీ ఎంపీపీలు పైలా జగన్నాథరావు, మాసవరపు అప్పలనాయుడు, జనసేన మండల ఇన్‌చార్జి పంచకర్ల ప్రసాద్, టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు కన్నూరు వెంకటరమణ, మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు, రెడ్డి శ్రీనివాసరావు, వియ్యపు చిన్న, పైలా రామచంద్రరావు, నగిరెడ్డి చిన్నారావు, పాల్గొన్నారు.

ఓవర్‌లోడు లారీకి జరిమానా

అనకాపల్లి టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి మీదుగా వెళ్లేందుకు ప్రయత్నించిన ఓవర్‌లోడు క్వారీ లారీకి బుధవారం రాత్రి జరిమానా విధించినట్టు ట్రాఫిక్ సీఐ ఎం. వెంకటనారాయణ తెలిపారు. అధిక లోడుతో వాహనం పట్టణంలోకి రావడమే కాకుండా నిబంధనలు అతిక్రమించినందుకు సిబ్బంది లారీని అదుపులోకి తీసుకున్నారన్నారు. లారీకి రూ. 20వేల 035లు జరిమానా విధించామని సీఐ వెంకట నారాయణ తెలిపారు.


అనకాపల్లి అభివృద్ధిపై ఎమ్మెల్యే సమీక్ష



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

అనకాపల్లి టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ గురువారం స్థానిక జీవీఎంసీ ఎస్‌ఆర్ శంకరన్ భవనంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో 11 గ్రామాల్లో కిడ్నీ సంబంధిత వ్యాధులకు మందులు పంపిణీ విషయంలో వైద్యాధికారులతో ఆయన సమీక్ష చేసి మందుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయుష్మాన్ మందిర్ ఆరోగ్య కేంద్రాలకు సంబంధిత స్థల పరిశీలనను త్వరితగతిన పూర్తి చేసి సంబంధిత అధికారులకు స్వాధీనం చేయాలని తహశీల్దార్‌కు ఆదేశాలు జారీ చేశారు. అనకాపల్లి, కశింకోట మండలంలో జీవీఎంసీకి సంబంధించి ఒక్కొక్క వారంలో పీజీఆర్‌ఎస్‌లో పాల్గొంటానని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆర్డీవో షేక్ ఆయిషా, జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి, వివిధశాఖల విభాగాధిపతులు పాల్గొన్నారు.

సీతలదుర్గగా సతకంపట్టు కనకదుర్గమ్మ



సీతలదుర్గ అలంకరణలో కనకదుర్గమ్మ, పక్కన కలశజ్యోతి ప్రదర్శన

అనకాపల్లి టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక గవరపాలెం సతకంపట్టులోని కనకదుర్గమ్మ అమ్మవారు మార్గశిరమాసం పౌర్ణమి సందర్భంగా సీతలదుర్గగా భక్తులకు గురువారం దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఆలయం వద్ద కలశజ్యోతి ప్రదర్శనను అధిక సంఖ్యలో భక్తులు నిర్వహించారు. ఆలయానికి వచ్చే భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు, వ్యవస్థాపక చైర్మన్ పీవీ రమణ, గౌరీ పరమేశ్వరి కమిటీ, మరిడిమాంబ కమిటీ సభ్యులు, అధికసంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

» సింహాద్రి ఎన్టీపీసీ ఈడీ సమీర్‌శర్మ



ఉపకరణాలు అందుకున్న దివ్యాంగులతో సింహాద్రి ఎన్టీపీసీ ఈడీ సమీర్‌శర్మ, తదితరులు

పరవాడ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని సింహాద్రి ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) సమీర్‌శర్మ పిలుపునిచ్చారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక దీపాంజలినగర్ టౌన్‌షిప్‌లో బుధవారం రాత్రి దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఈడీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దివ్యాంగులు కూడా అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అనంతరం సంస్థ సీఎస్‌ఆర్ కార్యక్రమంలో భాగంగా 90 మంది దివ్యాంగులకు రూ. 9.25 లక్షల విలువ గల వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలు, తదితర ఉపకరణాలను ఈడీ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సింహాద్రి వివిధ విభాగాల జీఎంలు, ఏజీఎంలతో పాటు పరవాడ భవిత కేంద్రం ఉపాధ్యాయులు, దివ్యాంగుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో భద్రతకు అధిక ప్రాధాన్యం

» కంపెనీ ప్రతినిధులకు ఎస్పీ తుహిన్‌సిన్హా సూచన



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

పరవాడ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్పీ తుహిన్‌సిన్హా సూచించారు. ఫార్మాసిటీలోని మాన్‌కైండ్ ఫార్మా పరిశ్రమను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు, ఉద్యోగులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పలు సలహాలు, సూచనలు చేశారు. కార్మికులకు ఎల్లప్పుడూ భద్రతా పరికరాలు అందుబాటులో ఉంచాలన్నారు. క్రమం తప్పకుండా మాక్‌డ్రిల్ నిర్వహించాలన్నారు. పరిశ్రమలో హౌస్ కీపింగ్, వ్యర్థ పదార్థాలను శుభ్రపరిచే విధానాన్ని కూడా సమర్థంగా నిర్వహించుకోవాలని చెప్పారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం పరిశ్రమ ప్రాంగణంలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో పరవాడ డీఎస్పీ వి.విష్ణుస్వరూప్, పరిశ్రమ కార్పొరేట్ అధికారులు హానీ రిజ్వవి, గౌరవ్‌సింగ్, హెచ్‌ఆర్ మేనేజర్ నరేష్, పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు, పరిశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సంఘాలు అన్ని రంగాల్లో రాణించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శచీదేవి

» డీఆర్‌డీఏ పీడీ కె.శచీదేవి

సబ్బవరం, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి) : మహిళా సంఘాలు అన్ని రంగాల్లో రాణించాలని డీఆర్‌డీఏ పీడీ కె.శచీదేవి అన్నారు. స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో గురువారం జిల్లా స్థాయి మహిళా సమాఖ్య కార్యవర్గ సభ్యులకు నిర్వహించిన విజనింగ్ శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రానున్న ఐదేళ్లలో గ్రామ సంఘాలు, మండల సమాఖ్య సంఘాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడానికి విజన్ ప్లాన్లు తయారు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్బవరం, పరవాడ, చోడవరం, ఎలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం, గొలుగొండ మండలాల మహిళా సమాఖ్య కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఫార్మా ప్రతినిధులతో జరగాల్సిన సమావేశం వాయిదా

పరవాడ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఫార్మా పరిశ్రమల ప్రతినిధులతో ఈ నెల 6న కలెక్టర్, ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు నిర్వహించాల్సిన సమావేశం వాయిదా పడినట్టు కూటమి నాయకులు తెలిపారు. గురువారం పరవాడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఎంపీ సీఎం రమేశ్ అందుబాటులో లేకపోవడంతో సమావేశాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్టు తెలిపారు. త్వరలోనే సమావేశం తేదీని ప్రకటిస్తామని వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కన్నూరు వెంకటరమణ, సర్పంచ్‌లు శిరపురపు అప్పలనాయుడు, మోటూరు సన్యాసినాయుడు, మాజీ సర్పంచ్ చింతకాయల ముత్యాలు, బుగిడి రామగోవిందరావు, కరణం నరసింగరావు, రెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు



మాట్లాడుతున్న రంగాచారి

తుమ్మపాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు మండల వ్యవసాయాధికారి పి.రంగాచారి తెలిపారు. గురువారం బవులవాడలో నిర్వహించిన రైతన్నా.. మీ కోసం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల్లోని ప్రతి రైతును కలిసి వారి సమస్యలను పరిష్కరించనున్నామన్నారు. అలాగే వ్యవసాయానికి సంబంధించిన పలు సూచనలను చేయనున్నామని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అర్హులైన వారందరికీ అందేలా వ్యవసాయాధికారులు చర్యలు చేపడుతున్నారన్నారు. సమస్యలున్న వారు వ్యవసాయాధికారులను సంప్రతించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు రామకృష్ణ, అర్జున్, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా దత్తాత్రేయ స్వామి జయంతి



దత్తాత్రేయుడిని దర్శించుకుంటున్న మలసాల భరత్‌కుమార్

కశింకోట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తేగాడ గ్రామంలో దత్తాత్రేయ స్వామి జయంతి కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి స్వామికి పలు విశేష పూజలు చేశారు. అనంతరం దత్తాత్రేయుడిని తేగాడ, ఘంటవానిపాలెం, పేరంటాలపాలెం, కొత్తపల్లి, బయ్యవరం గ్రామాల మీదుగా ఊరేగింపుగా గిరి ప్రదక్షిణ చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన చేశారు. వైసీపీ అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ దత్తాత్రేయుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు గుళ్ళపల్లి శివకుమార్, మండల అధ్యక్షుడు మలసాల కిశోర్, నాయకులు గున్నయ్యనాయుడు, గొల్లవిల్లి శ్రీను, యువజ విభాగం అధ్యక్షుడు నీటిపల్లి దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

'పర్మినెంట్ ఉద్యోగులకు పెండింగ్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలి'

తుమ్మపాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పర్మినెంట్ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న ఇంక్రిమెంట్లు, స్పెషల్ ఇంక్రిమెంట్లు తక్షణమే విడుదల చేయాలని జీవీఎంసీ మునిసిపల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె.సత్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనకాపల్లి టౌన్ ప్లానింగ్‌లో స్క్వాడ్ వర్కర్లుగా పనిచేస్తున్న కార్మికులకు బకాయిపడిన 18 నెలల జీతాలను తక్షణమే విడుదల చేయాలన్నారు. పారిశుధ్య కార్మికులకు అవసరమైన పనిముట్లను అందించాలన్నారు. అనంతరం యూనియన్ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ జిల్లా గౌరవాధ్యక్షుడుగా కోన లక్ష్మణ, అధ్యక్షుడిగా యర్రంశెట్టి అప్పలరాజు, ఉపాధ్యక్షుడిగా యర్రంశెట్టి సుమన్, ప్రధానకార్యదర్శిగా బంగారి రవికుమార్, కార్యదర్శిగా నిమ్మకాయల నరసింహమూర్తి, కోశాధికారిగా వి.శివకుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సింగంపల్లి అజయ్ కుమార్, కమిటీ సభ్యులుగా బంగారి శంకర్, సింగంపల్లి విజయ్‌లను ఎన్నుకున్నారు. ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

PASSPORT LOST
I CHELLURI APPALARAJU S/o. Ch. Ramana. Lost my Passport bearing no W2695270 while travelling to Rambilli on 20-11-2025. If anyone find it please kindly contact me at 8500883543.

ఓటర్ల మ్యాపింగ్ పూర్తి చేయాలి: తహశీల్దార్



బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లతో సమావేశమైన తహశీల్దార్ వీరభద్రచారి

అనంతగిరి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఓటర్లకు సంబంధించి మ్యాపింగ్ త్వరితగతిన పూర్తిచేయాలని స్థానిక తహసీల్దార్ వీరభద్రచారి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోబీఎల్‌వోలు, సూపర్‌వైజర్లతో తహశీల్దార్ గురువారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఓటర్ల మ్యాపింగ్, కొత్తఓటర్ల నమోదు, సవరణలు, పురోగతి సమీక్షించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఎస్ఐఆర్‌పై మరింత అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. 46 మంది బీఎల్‌వోల ఆయా పోలింగ్ కేం ద్రాలకు సంబంధించి, ఓటర్ల, తదితర వాటిపై పూర్తిసమాచారం ఉండాలని ఆదేశించారు. ఫారం 6లోని కొత్త ఓటర్ల నమోదు, ఫారం 7లోని ఓటర్ మృతిచెందితే తొలగింపు, ఫారం 8 లో పేర్లు మార్పు, సవరణలు సమీక్షించి పలు సూచనలు చేశారు. బోగస్ ఓ ట్లకు తావులేకుండా చర్యలు చేపడుతున్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న నిపుణుడు తేజ

కొయ్యూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కంటికి సంబంధించి ఏ సమస్య వచ్చినా తక్షణం వైద్య సాయం పొందాలని కాకినాడ ధర్మవరంనకు చెందిన అంజు కంటి ఆసుపత్రి వైద్యాధికారి తేజ సూచించారు. గురువారం స్థానిక మండల మహిళ సమాఖ్య (వెలుగు) కార్యాలయంలో అంజు ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 200 మందికి వైద్యాధికారి తేజ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. కేటరాక్ట్ తదితర సమస్యలతో బాధ పడుతున్న సుమారు 20 మందిని గుర్తించి ఉచిత శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. వీరిని వాహనంలో ఆస్పతికి తరలించారు. ఈ శిబిరాన్ని రాజేంద్రపాలెం సర్పంచ్ సింహాచలం తొలుత ప్రారంభించగా, ఏపీఎం సాధన, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గొండెల మాజీ సర్పంచ్ మృతి



నారాయణ నాయుడు (ఫైల్‌ఫొటో)

పాడేరురూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, గొండెలి పంచాయతీ మాజీ సర్పంచ్ కిముడు నారాయణ నాయుడు ఆకస్మికంగా గురువారం ఉదయం మృతి చెందారు. మండలంలోని ఆయన స్వగ్రామం గొండెలిలో శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి, జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు, తెలుగు మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బొర్రా విజయరాణి, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి డప్పోడి వెంకటరమణ, మండల పార్టీ అధ్యక్షుడు రేగం కొండబాబు, ఎంపీపీ ఎస్.రత్నకుమారి, వైస్‌ఎంపీపీ గంగ పూజారి శివకుమార్, డిప్పల వెంకటకుమారి తదితరులు ఆయన మృతికి సంతాపం తెలిపారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజల్లో భక్తులు

చింతపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిబాబా ఆలయంలో గురువారం దత్తాత్రేయ జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక అర్చనలు, హోమం, కుంకుమ పూజలు జరిగాయి. చింతపల్లి, జీకేవీధి మండలాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. భక్తులకు మాదాబత్తుల బాబూరావు, సూర్యకుమారి దంపతులు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకుడు నిత్యానంద స్వామి, నిర్వహకులు రమణమూర్తి, తాడి రమణరాజు, హర్ష శ్యామల, మహాలక్ష్మి పాల్గొన్నారు.

మెగా పేరెంట్, టీచర్ సమావేశం విజయవంతం చేయాలి

హుకుంపేట డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) ; ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఈనెల 5న నిర్వ విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్వహించనున్న సమావేశం విజయవంతం చేయాలని ఎంఈఓ ఈశ్వరరావు తెలిపారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులకు ఆహ్వానం పత్రాలు అందించి వారు వచ్చే విధంగా చూడాలని ఆయన ఉపాధ్యాయులకు ఆదేశాలిచ్చామన్నారు. పిల్లల కుటుంబాలకు పాఠశాలలో భోజన సదుపాయానికి ఖర్చులకు ప్రభుత్వం ముందుగానే ఉపాధ్యాయులు ఖాతాలో చేసినట్టు చెప్పారు. ప్రత్యేకంగా మిడేడే మీల్స్ వార్డెన్స్ మెనూ ప్రకారం భోజనాలు వడ్డించాలన్నారు.

చింతపల్లి: గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలలు, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో శుక్రవారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం జరుగుతుందని స్థానిక ఏటీడబ్ల్యూవో బి. జయనాగలక్ష్మి తెలిపారు. విద్యార్థుల వికాసం కోసం ఈ సమావేశంలో చర్చించి భవిష్యత్ ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. తల్లిదండ్రులందర హాజరుకావాలన్నారు. పీజీహెచ్‌ఎంలు సాగిన రామరాజుపడాల్, పలాసీ ప్రసాదరావు, బీఎస్ఎన్ రాజు పాల్గొన్నారు.

విద్యార్థులపై కొరవడిన పర్యవేక్షణ

» హుకుంపేటలో ఆరుబయట తిరుగుతున్న ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు



వీధుల్లో తిరుగుతున్న పాఠశాలల విద్యార్థులు

హుకుంపేట డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి); మండలం కేంద్రంలో ఉన్న మూడు గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలల విద్యార్థులపై పర్యవేక్షణ కొరవడుతోంది. దీంతో ప్రతిరోజూ ఉదయం నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రధాన రోడ్లు, దుకాణాల వద్ద తిరుగుతున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ప్రతి రోజు సక్రమంగా పాఠశాలలో ఉంటూ మంచిగా చదువుతున్నారని భావిస్తుంటారు. కానీ, ఇక్కడ పిల్లలు పాఠశాలలో కాకుండా ఆరుబయట అధిక సమయం వెచ్చిస్తుడడడంపై స్థానికులు విచారం వ్యక్తంచేస్తున్నారు. ఉదయం, మధ్యాహ్నం హాజరు వేసిన సమయంలో విద్యార్థులు లేకపోవడాన్ని పాఠశాల సిబ్బంది గుర్తించడంలేదా.. లేదా నిర్లక్ష్యం వహిస్తున్నారా.. అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బయట తిరగటంతో పిల్లలు చెడుమార్గం పట్టే అవకాశం ఉంది. స్థానిక పాఠశాలల ఉపాధ్యాయుల నిర్లక్ష్యం వహిస్తుండడంతో వారి భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతుందని ఆందోళన వ్యక్తమవుతోంది. పిల్లలు రోడ్డు ప్రమాదాల బారిన పడితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పాఠశాలల్లో వ్యాయాయ విద్య పిరియడ్ కేటాయించలేనట్టు తెలుస్తోంది. పిల్లలను ఉదయం, సాయంత్రం పర్యవేక్షించాలని కోరుతున్నారు. పాఠశాలలోనే ఆటపాటలు, స్టడీ అవర్స్ నిర్వహిస్తే వారిని బయట తిరిగే అలవాటు నుంచి దూరం చేయవచ్చునని అభిప్రాయం వ్యక్తమవుతోంది. సంబంధిత అధికారులు ఈ దిశగా ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు ఈ సందర్భంగా కోరుతున్నారు.

శ్రమదానంతో మట్టిరోడ్డు నిర్మాణం



మట్టిరోడ్డు రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్న జంపాపుట్టు గిరిజనులు

అనంతగిరి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల కివర్ల పంచాయతీ జంపాపుట్టు గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడం గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర పరిస్థితిలో గర్భిణులు, రోగులను డోలీమోతలతో తీసుకువెళ్లాల్సి వస్తోంది. ఈ సమస్యపై పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించిన ఫలితం లేకపోవడం గ్రామస్థులంతా చేయిచేయి కలిపారు. గురువారం ఉదయం గ్రామస్థులంతా మట్టిరోడ్డు నిర్మాణానికి పూనుకున్నా రు. ఇప్పటికైనా కలెక్టర్ గారు..స్పందించి, రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరుచేసి, మా సమస్యను పరిష్కరించాలని గిరిజనులు సోడేపల్లి సోములు, నారాయణ, సత్యరావు, సింహాచలం, ఈశ్వరరావు, తదితరులు కోరుతున్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



ఆసనాలు వేయిస్తున్న సిమ్ వ్యవస్థాపకులు బొబ్బిలి రామకృష్ణ

అరకులోయ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మానసిక ప్రశాంతతకు యోగా ఎం తగానో దోహదపడుతుందని సిమ్ వ్యవస్థాపకుడు డాక్టర్ బొబ్బిలి రామకృష్ణ అన్నా రు. స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్లు -1,2 ఆధ్వ ర్యంలో దత్తత గ్రామాలైన రవ్వలగుడ, ఆర్.డుంబ్రిగుడల్లో మంగళవారం నుంచి సే వా శిబిరాలు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా గురువారం ఆర్.డుంబ్రిగుడ పా ఠ శాల ప్రాంగణంలో యోగా కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ పీవోలు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి ఎస్.కోటకు చెందిన సిమ్ వ్యవస్థాపకుడు బొబ్బిలి రామకృష్ణ ముఖ్య అతిథి విచ్చేసి యోగాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక ఉల్లాసానికి, సంపూర్ణ ఆరోగ్యానికి యోగా ఉపయోగపడుతుందన్నారు. వలంటీర్లతో ధ్యానం, ఆసనాలు వేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కొండబాబు ఎన్ఎస్ఎస్ పీవోలు విజయలక్ష్మి, నాగబాబు, గ్రామస్థులు పాల్గొన్నారు. రామకృష్ణను సత్కరించారు.

డీఏవీ పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బందికి అందని జీతాలు

» మూడు నెలలుగా ఆర్థిక సమస్యలతో సతమతం

సీలేరు, డిసెంబరు 4 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం సీలేరులో ఏపీ జెన్‌కో ఆధ్వర్యంలో నడుస్తున్న డీఏవీ పాఠశాలలో ఉపాధ్యాయులకు, సిబ్బందికి మూడు నెలలుగా జీతాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానిక సీఐ టీయూ నాయకుడు ఎస్‌కె సుభాన్ తెలిపారు. తక్షణమే జెన్‌కో యాజమాన్యం స్పందించి నిధులు విడుదల చేసి వారికి జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీలేరులో ఏపీ జెన్‌కో ఉద్యోగుల పిల్లల చదువుల కోసం డీఏవీ పాఠశాలను ఏర్పాటు చేశారు. జెన్‌కో ఉద్యోగుల పిల్లలతోపాటు స్థానికంగా ఉండే ఇతర చిన్నారులు ఈ పాఠశాలలో చదువుతున్నారు. అయితే ఇక్కడ పనిచేసే ఉపాధ్యాయులకు, ఇతర సిబ్బందికి ఏపీ జెన్‌కో డీఏవీ యాజమాన్యం చెల్లించే బిల్లు నుంచి జీతాలు చెల్లిస్తారు. గత మూడు నెలలుగా బడ్జెట్‌ను విడుదల చేయలేదు. దీంతో ఉపాధ్యాయులు, సిబ్బంది ఆర్థికంగా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సీఐటీయూనేత ఎస్‌కే సుభాన్ కోరారు.

రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదాన శిబిరంలో అధికారులు, యువకులు

అరకులోయ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరానికి విశేషస్పందన లభించింది. విద్యార్థులు, స్థానికులు రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చారు. ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీపూజ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కుమారస్వామి, ఎంపీడవో లవరాజు, అరకు సీఐ హిమగిరి, ఏటీడబ్ల్యూవో కూడ వెంకటరమణ, ఎంఈవో త్రినాథరావు, తదితరులు పాల్గొన్నారు. రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని సూచించారు.

పోక్సో కేసు నమోదుపై ఏఎస్పీ విచారణ

సీలేరు, డిసెంబరు 4 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం సీలేరు పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదు చేసిన పోక్సో కేసుపై చింతపల్లి ఏఎస్పీ నవజ్యోతి విశ్రా గురువారం విచారణ చేపట్టారు. బాలికను యువకుడు మోసగించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఎస్ఐ యాసిన్ నుంచి కేసు వివరాలను తీసుకుని పరిశీలించారు. అనంతరం మధ్యవర్తుల సమక్షంలో నేరస్థలాన్ని పరిశీలించారు. ఈ సం దర్భంగా నిందితుడు కుటుంబ సభ్యులు, బాధితురాలి కుటుంబ సభ్యులను ఏఎస్పీ విచారించారు

'అధ్యాపకుడిపై చర్యలు తీసుకోవాలి'



అస్వస్థతో చికిత్స పొందుతున్న విద్యార్థిని పరామర్శిస్తున్న గిరిజన సంఘం నాయకులు

చింతపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థిపై విచక్షణ రహితంగా దండించిన అతిథి అధ్యాపకుడిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి డిమాండ్ చేశారు. గురువారం చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి జయంత్‌ని గిరిజన సంఘ నాయకులు పరామర్శించారు. ఈసందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ చింతపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హోంవర్కు చూపలేదని అతిథి అధ్యాపకుడు విద్యార్థిని కర్రతో తీవ్రంగా కొట్టడంతోపాటూ బూటు కాలితో పొట్ట భాగంలో దాడి చేసినట్టు బాధిత విద్యార్థి తెలిపాడన్నారు. దీంతో విద్యార్థినితీవ్ర అస్వస్థతతో ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు. కలెక్టర్, బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ కమిషనర్ విచారణ చేపట్టి అధ్యాపకుడిని విధుల్లో నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి తల్లిదండ్రులు బండి రవికుమార్, తులసి, గిరిజన సంఘనేత కొర్ర రాజుబాబు పాల్గొన్నారు.

స్క్రబ్ టైఫస్ వ్యాధిపై అప్రమత్తం: డీఎంహెచ్‌వో



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో కృష్ణమూర్తినాయక్

పాడేరురూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్క్రబ్ టైఫస్ వ్యాధి పట్ల జిల్లా కార్యాలయ ప్రోగ్రాం అధికారులు, 64 పీహెచ్‌సీల వైద్యాధికారులు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్. డి. కృష్ణమూర్తి నాయక్ ఆదేశంచారు. వ్యాధి వ్యాప్తించకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలను చేపట్టాలన్నారు. స్క్రబ్ టైఫస్ ఒక జూనోటిక్ వ్యాధి అన్నారు. ముఖ్యంగా ఈ వ్యాధి రైతులు, పంట పొలాలు, తోటల్లో పనిచేసే వ్యక్తులకు సోకే ప్రమాదం ఉందన్నారు. ఈ వ్యాధి సోకిన వారికి జ్వరం, తలనొప్పి, శరీర నొప్పులు, కండరాల నొప్పుల, కొన్నిచోట్ల నలుపు రంగులో పుండ్లు వస్తాయన్నారు. వ్యాధి నిర్ధారణ అనంతరం తీసుకోవాల్సిన చికిత్సలను వివరించారు. ఈ పరీక్షల సమయంలో కిడ్నీ, గుండె, శ్వాస సంబంధిత తీవ్రసమస్యలు ఉన్న రోగులను హయ్యర్ సెంటర్‌కు తరలించి వైద్య సేవలు అందించాలని సూచించారు. వైద్య సిబ్బంది వ్యాధిపై గ్రామాల్లో విస్తృత ప్రచారంతో పాటు రోగులకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు పరీక్షలను చేపట్టాలని ఆదేశించారు.

మన్యాన్ని కమ్మేస్తున్న పొగమంచు

» అరకులోయ, డుంబ్రిగుడలో 14.3 డిగ్రీల ఉష్ణోగ్రత



పాడేరు మెయిన్‌రోడ్డులో గురువారం ఉదయం పొగమంచు

పాడేరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): వా తావరణంలోని మా ర్పులతో మన్యంలో క నిష్ఠ ఉష్ణోగ్రతలు క్ర మంగా పెరుగుతున్నా, పొగమంచు మాత్రం తగ్గడం లేదు. ఏజెన్సీలో గురువారం ఉదయం తొమ్మిది గంటల వరకు దట్టంగా పొగమంచు కమ్మేసింది. దీంతో ఎదురుగా ఉన్న వ్యక్తులు సైతం కన్పించని స్థితిలో వాహనాలు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించాయి. చలి నుంచి రక్షణ పొందేందుకు చలి మంటలు కాగుతున్నారు. గురువారం ఏజెన్సీలో అరకులోయ, డుంబ్రిగుడలో 14.3 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా హుకుంపేటలో 14.6, ముంచంగిపుట్టులో 15.1, పెదబయలులో 15.8, పాడేరులో 16.1, చింతపల్లిలో 17.6, కొయ్యూరులో 18.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

శ్రమదానంతో పారిశుధ్య పనులు



డి.కుమ్మరిపుట్టులో మురుగు కాలువలను శుభ్రపరుస్తున్న మహిళలు

ముంచంగిపుట్టు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోజూట దారెల పంచాయతీ పరిధి డి.కుమ్మరిపుట్టులో స్థానికులు గురువారం శ్రమదానంతో పారిశుధ్య పనులు చేపట్టారు. మహిళలు చీపురు, పారలను పట్టి మురుగు నీరు నిల్వలను తొలగించారు. చెత్తను పారబోసి మురుగునీరు నిల్వ ఉండకుండా శుభ్రం చేశారు. గ్రామంలో చెత్త చెదారాలు పేరుకుపోవడంతో వ్యాధుల బారిన పడుతుండడంతో మహిళలు అంతా కలసికట్టుగా శ్రమదానం చేశారు. అయితే, గ్రామంలో డ్రైనేజీలు, సీసీ రోడ్లు నిర్మాణం చేపట్టాలని గ్రామస్థులు అధికారులను కోరారు. ఆ గ్రామస్తులు కోరుతున్నారు.

విలువిద్యలో పతకాలు సాధించిన విద్యార్థులకు అభినందన



జాతీయ స్థాయి ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పాడేరురూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జాతీయ విలు విద్య పోటీల్లో పతకాలను సాధించిన విద్యార్థులను కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అభినందించారు. 42వ ఎన్‌టీపీసీ సబ్ జూనియర్ జాతీయ విలువిద్య పోటీల్లో పాల్గొన్న స్థానిక ప్రైవేటు పాఠశాలలో 10వ తరగతి విద్యార్థి సీహెచ్.మోహిత్ సాయి, అరకు క్రీడా పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న వి.లలిత్ సాయి తేజలు పాల్గొని రజిత పతకాలు సాధించారు. ఈ నెల 10వ తేదీ నుంచి 18వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరగనున్న 32వ సీనియర్ జాతీయ స్థాయి పోటీలకు అర్హత సంపాదించారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ కార్యాలయానికి గురువారం వీరిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్, కోచ్‌లు డీఎస్‌డీవో ఎ.జగన్మోహన్‌తో కలిసి శుక్రవారం కలెక్టర్ క్రీడా పోటీలకు వెళ్లేందుకు విద్యార్థులకు ఆర్థిక సహాయం చేయాలని కోరారు. స్పందించిన కలెక్టర్ సాయం అందించేందుకు ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా పోటీల్లో చక్కగా రాణించి జిల్లాకు గుర్తింపు తేవాలని ఆకాంక్షించారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శద్ధ చూపాలి

పార్లమెంట్‌లో ఎంపీ గుమ్మ తనూజరాణి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ తనూజరాణి

అనంతగిరి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలోని విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అరకు ఎంపీ గుమ్మ తనూజరాణి కోరారు. గురువారం పార్లమెంట్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కురుపాం గురుకులం పాఠశాలలోని విద్యార్థినులు పచ్చకామెర్లతో తీవ్ర అస్వస్థతకు గురై కేజీహెచ్‌లోని చేరారని, అలాగే, గూడెంకొత్తవీధి మండలం జర్రెలలోని బాలురు పాఠశాల, కొయ్యూరు మండలం రాజేంద్రపాలెం బాలికల వసతిగృహం ఫుడ్‌పాయిజన్ వల్ల విద్యార్థులు ఆస్పత్రుల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. నెలల వ్యవధిలో ఈ ఘటనలు పునరావృతమైనట్టు చెప్పారు. ఈ స్థితిలో వసతిగృహాల్లో ఆర్వో ప్లాంట్లు మెరుగుపరచి స్వచ్ఛమైన నీటిని అందించేలా చూడాలన్నారు. నాణ్యమైన ఆహారం, వసతిగృహాల్లో సౌకర్యాలు కల్పించాలన్నారు. గిరిజన ప్రాంతంలో వైద్యసేవలు మరింత మెరుగుపరిచేందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. ప్రత్యేక వైద్య నిపుణులను నియమించి గిరిజనుల ఆరోగ్యానికి భరోసా కల్పించాలని కోరారు.

హైవే బాధితుల పరిహారం పంపిణీకి చర్యలు

» ఆర్‌డీవో, స్పెషల్ కలెక్టర్ లోకేశ్వరరావు



బాధితులతో మాట్లాడుతున్న ఆర్‌డీవో లోకేశ్వరరావు

జి.మాడుగుల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి బాధితులకు పరిహారం పంపిణీకి చర్యలు చేపడుతున్నట్లు పాడేరు ఇన్‌చార్జి ఆర్‌డీవో, స్పెషల్ కలెక్టర్ ఎంవీఎస్ లోకేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం ఆయన స్థానిక తహసీల్దార్ రాజ్‌కుమార్‌తో కలిసి గెమ్మెలి పంచాయతీ బలమనుశంక, వరిగెలపాలెం గ్రామాల్లో పర్యటించారు. బాధితులతో మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జాతీయ రహదారి 516ఈ నిర్మాణంలో ఇళ్లు, పంట భూములు కోల్పోయిన నిర్వాసితుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పరిహారం అందజేస్తామని హామీ ఇచ్చారు. రహదారి నిర్మాణానికి ఆటంకం కలిగించొద్దని చెప్పారు. ఆయన వెంట హైవే, పోలీస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీ డుంబ్రిగుడ పోలీస్ స్టేషన్ తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న డిఎస్పీ షేక్ షహబాజ్ అహ్మద్

డుంబ్రిగుడ, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీసు స్టేషన్‌ను గురువారం పాడేరు డీఎస్పీ షేక్ షహబాజ్ అహ్మద్ సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పనితీరు, కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అరకు సర్కిల్ ఇన్ స్పెక్టర్ హిమగిరి, ఎస్ఐ పాపినాయుడు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో వినియోగంలోకి జడ్పీ అతిథి గృహం

» పీఆర్ డీఈఈ కిముడు జ్యోతిబాబు



చింతపల్లిలోని జడ్పీ అతిథి గృహం మరమ్మతులను పరిశీలిస్తున్న డీఈఈ. ఏఈఈలు

చింతపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ అతిథి గృహం వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని పాడేరు పంచాయతీరాజ్ డీఈఈ కిముడు జ్యోతిబాబు తెలిపారు. గురువారం ఆయన జిల్లా పరిషత్ అతిథి గృహాన్ని సందర్శించి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈసందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ జిల్లా పరిషత్ అతిథి గృహం మరమ్మతుల వల్ల మూడేళ్లుగా వినియోగంలోలేదన్నారు. అతిథి గృహంలో ఒక వీఐపీ, మూడు సాధారణ గదులు, ఒక కిచెన్, డైనింగ్ హాల్ ఉన్నట్టు పేర్కొన్నారు. తాజాగా ప్రభుత్వం జిల్లా పరిషత్ నిధులు రూ20లక్షలతో మరమ్మతులు చేపడుతున్నామన్నారు.ఈ నెలాఖరు నాటికి పనులు పూర్తి చేస్తామన్నారు. అతిథి గృహంలో ఫ్యాన్లు, విద్యుత్ సదుపాయం కల్పిస్తామన్నారు. అదనపు నిధులతో ఫర్నీచర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. దీంతో అతిథులకు వసతి సమస్య తీరనుందన్నారు. ఈకార్యక్రమంలో స్థానిక పీఆర్ ఏఈఈ బాలకిశోర్ పాల్గొన్నారు.

'ఆంధ్రా కాంట్రాక్ట్ ఉద్యోగులకు' రక్షణ కల్పించాలి'



సమస్యను తహశీల్దార్‌కు వివరిస్తున్న సంఘ నేతలు, కాంట్రాక్ట ఉద్యోగులు

ముంచంగిపుట్టు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా-ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో ఆంధ్రాకు చెందిన కాంట్రాక్టు ఉద్యోగులకు రక్షణ కల్పించాలని బిర్సా ముండా ఎస్టీ మ్యూచువల్లీ ఎయిడెడ్ లేబర్ కాం ట్రాక్ట్ ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు వనుగు శేషాద్రి, సభ్యుడు మదన కోరారు. సొసైటీ సభ్యులు గురువారం స్థానిక తహశీల్దార్ భాస్కరఅప్పారావును కలసి సమస్యలను వివరించారు. కలెక్టర్ దృష్టికి ఈ సమస్యలను తీసుకువెళ్లడంతో పాటు కాంట్రాక్ట్ ఉద్యోగులకు పూర్తి రక్షణ కల్పించే విధంగా కృషి చేస్తానని ఈ సందర్భంగా తహశీల్దార్ వారికి హామీ ఇచ్చారు. అనంతరం శేషాద్రి మాట్లాడుతూ కాంట్రాక్ట్ పద్ధతిలో మాచ్‌ఖండ్ ప్రాజెక్టులో పని చేస్తున్న ఆంధ్రా ఉద్యోగులపై స్థానికులు దాడులకు, బెదిరింపులకు దిగుతున్నారన్నారు. దీంతో అక్కడ విధులు నిర్వహించడం కష్టసాధ్యంగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు బాలక్రిష్ణ, బాబూజీలు పాల్గొన్నారు.

మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన నేతలు



లోకేశ్‌తో కొప్పలవెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్, సతీమణి సత్యవతి

అనకాపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను గురువారం విశాఖ విమానాశ్రయంలో రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్, ఆయన సతీమణి సత్యవతి, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, టీడీపీ నేతలు ఉన్నారు.

నేడు మెగా పేరెంట్,టీచర్ మీటింగ్

నర్సీపట్నం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని పాఠశాలలో శుక్రవారం జరిగే మెగా పేరెంట్స్ మీటింగ్‌ని విజయవంతం చేయాలని ఎంఈవోలు తలుపులు, నాగేంద్ర కోరారు. మహిళా సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, దాతలు, ఉద్యోగులు సహకరించాలని కోరారు.

కాలువ తవ్వకంతో పైపులైన్ డ్యామేజీ



జి.కోడూరులో తవ్వి వదలివేసిన కాలువ

మాకవరపాలెం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో జి.కోడూరు గ్రామంలో ఇటీవల తుఫాన్ కారణంగా గ్రామంలో ఉన్న వర్షపు నీటిని బయటకు పోయేందుకు తవ్విన కాలువతో తాగునీటి పైపులైన్ మరమ్మతులకు గురైంది. అయితే నెల రోజులు గడుస్తున్నా ఈ పైపులైన్‌కు అధికారులు మరమ్మతులు చేపట్టలేదు. దీంతో గ్రామంలో కొళాయిలు పనిచేయక తాగునీరు అందడం లేదు. ఇప్పటికే అనేక మార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా నేటికి సమస్య పరిష్కారం కాలేదని స్థానికులు వాపోతున్నారు. తాగునీటి కొళాయిలు పనిచేయకపోవడంతో పక్క వీధిల్లో ఉన్న బోర్లు నుంచి తాగునీటిని తెచ్చుకుంటున్నామని మహిళలు తెలిపారు. అధికారులు స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టి కొళాయిల ద్వారా తాగునీరు అందేంచేందుకు కృషిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

ముగిసిన దత్తాత్రేయ సప్తాహ నామ సంకీర్తన



వీరవిల్లి అగ్రహారంలో దత్తాత్రేయుని పల్లకీ సేవ చేస్తున్న భక్తులు

మాడుగుల రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వీరవిల్లిఅగ్రహారం లో గురువారం దత్తాత్రేయుని అఖండ సప్తాహ నామ సంకీర్తన లో భాగంగా పల్లకి సేవ ఘనంగా నిర్వహించారు. స్థానిక అర్చకుడు శ్రీనివాస భరణి శర్మ ఆధ్వర్యంలో ఏడు రోజులు పాటు ప్రత్యేక హోమాలు, దత్తాత్రేయనికి నామస్మరణ ఏకాహం, భజనలు చేశారు. గురువారం చివరి రోజున స్వామి వారికి ప్రత్యేకహోమం జరిపారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేపట్టారు. సాయంత్రం దత్తాత్రేయుని పల్లకిలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా మార్గశిర మాసోత్సవాలు

లక్ష్మమ్మ కోవెలకు భక్తుల తాకిడి



లక్ష్మమ్మతల్లి

చోడవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మార్గశిర మాసం రెండవ గురువారం సందర్భంగా స్థానిక శ్రీ లక్ష్మమ్మ కోవెల కిటకిటలాడింది. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ కోశాధికారి నున్న గోపాలం ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. ప్రసాదాలు పంపిణీ చేశారు. గురువారం ఉదయం నుంచి ఆలయం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మార్గశిర మాసోత్సవాలలో భాగంగా ఈనెల 18న ఆలయ ఆవరణలో అన్న సమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు గోపాలం తెలిపారు.



అమ్మవారిని దర్శించుకునేందుకు బారులుతీరిన భక్తులు

పంచాయతీ షాపుల అద్దె వసూళ్లలో వాగ్వాదం



మాడుగులలో దుకాణదారుతో పంచాయతీ సిబ్బంది వాగ్వాదం

మాడుగుల, డిసెంబరు 4 (ఆంధ్ర జ్యోతి): అద్దె చెల్లించని పంచాయతీకి సంబంధించి షాపులకు తాళం వేయడానికి సిద్ధం కావడంతో పంచాయతీ సిబ్బంది, ఓ బార్బర్ దుకాణదారుడు మధ్య వాగ్వాదం చోటుచేసుకొంది. స్థానిక పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్ షాపులను వేలం ద్వారా కేటాయించారు. గురువారం పంచాయతీ సిబ్బంది వచ్చి అద్దె కోసం నిలదీశారు. ఇంకా చెల్లించే సమయం ఉందంటూ ఓ దుకాణదారుడు సమాధానం ఇచ్చాడు. దీంతో పంచాయతీ సిబ్బందిషెట్టర్‌ని కిందికి దించడంతో గొడవ నెలకొంది. కనీసం నోటీసు ఇవ్వకుండా షాపుని ఎలా మూసేస్తారని ఈ సందర్భంగా వ్యాపారులు ఆగ్రహం వ్యక్తంచేశారు.అనంతరం అద్దె చెల్లించన వారు పంచాయతీ కార్యదర్శి వద్దకు వచ్చి సమాధానం చెప్పాలని సిబ్బంది హెచ్చరించి వెనుతిరిగారు.

వివాదంపై ఎమ్మెల్యేకు వినతి

బుచ్చెయ్యపేట డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి) మండలంలో పీపీ అగ్రహారం గ్రామస్థులు గురువారం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజుని టీడీపీ నాయకుడు నైదాన నానిబాబు ఆధ్వర్యంలో కోమళ్ళపూడి బాబా ఆశ్రమం వద్ద గురువారం కలసి వినతి పత్రం అందించారు. తమ గ్రామానికి 24 గంటల కరెంట్ సరఫరాలో భాగంగా ప్రత్యేక లైన్, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నారన్నారు. అయితే, ఈసందర్భంగా గ్రామంలో సిమెంటు దిమ్మ నిర్మాణం వివాదం నెలకొనడంతో తమపై న్యాయంగా కేసు నమోదు చేశారని ఎమ్మెల్యే ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఎమ్మెల్యే తహశీల్దార్, ఎస్ఐతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు.

గురుకుల కళాశాలల్లో విద్యాభివృద్ధికి కృషి

▸▸ రాష్ట్ర గురుకుల కళాశాలల జేడీ రాజ్యలక్ష్మి



అంబేడ్కర్ గురుకుల కళాశాలలో మెనూ పరిశీలిస్తున్న జాయింట్ డైరెక్టర్ రాజ్యలక్ష్మి

గొలుగొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అంబేడ్కర్ గురుకుల గురుకుల కళాశాలల్లో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్టు రాష్ట్ర గురుకుల కళాశాలల జాయింట్ డైరెక్టర్ రాజ్యలక్ష్మి తెలిపారు. మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో గురువారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. తొలుత విద్యార్థులకు వడ్డించే మెనూ పరిశీలించారు. విద్యార్థుల వసతిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్. అంబేడ్కర్ గురుకుల కళాశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించే విధంగా చర్యలు చేపట్టామన్నారు. రాష్ట్రంలో గల కళాశాలల్లో మౌలిక వసతులను కల్పించేందుకు చర్యలు చేపట్టామన్నారు. వచ్చే పబ్లిక్ పరీక్షల్లో పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణతకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గొలుగొండలో విద్యార్థులకు అదనపు తరగతి గదులు, ఉపాధ్యాయులకు వసతి ఏర్పాటు చేయాలని స్థానిక ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు వివరించారు. దీనిపై ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖ జోన్ డీసీవో గ్రేస్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలి : డీఐఈవో వినోద్‌బాబు



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఐఈవో ఎం.వినోద్‌బాబు

కృష్ణాదేవిపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి శతశాతం ఉత్తీర్ణత సాధించాలని డీఐఈవో ఎం.వినోద్‌బాబు పిలుపునిచ్చారు. గురువారం మధ్యాహ్నం కృష్ణాదేవిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత అధ్యాపకులు హాజరుపట్టి, ఇతర రికార్డులను తనిఖీ చేశారు. సంకల్పం 2026లో భాగంగా అధ్యాపకులంతా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారంతా ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అధ్యాపకుల బోధన తీరును పరిశీలించారు. అనంతరం వినోద్‌బాబు మాట్లాడుతూ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రతి విద్యార్థి ఇష్టపడి చదవాలన్నారు. గత ఏడాది కన్నా జూనియర్ కళాశాలలో మెరుగైన ఫలితాలు రావాలన్నారు. ఇందుకు అధ్యాపకులు నిరంతరం కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీహరి, అధ్యాపకులు రుత్తల గంగరాజు, గోవిందు, శ్రీను, చిన్ని, అంకంరెడ్డి శ్రీనివాసరావు, సత్యనారాయణ, నాగేశ్వరి , రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు సొసైటీ స్టాఫ్ అసిస్టెంట్ గోవింద బదిలీ

▸▸ గతంలో ఏసీబీ దాడుల్లో పట్టుబడ్డ ఉద్యోగి
▸▸ మళ్లీ తామరం సొసైటీలో ఉద్యోగం
▸▸ చివరకు స్పీకర్ అయ్యన్న జోక్యంతో బదిలీ

మాకవరపాలెం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తామరం పీఏసీఎస్‌లో స్టాఫ్ అసిస్టెంట్ ఎస్.గోవిందను రోలుగుంట మండలానికి బదిలీ చేశారు. గత నెల 21వ తేదీన డీసీసీబీ అధికారులు గోవిందను బదిలీ చేసినప్పటికీ తామరం పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జి నాగవెంకట చినబాబు రిలీవ్ చేయలేదు. ఈ విషయం స్పీకర్ అయ్యన్నపాత్రుడుకి తెలియడంతో వెంటనే రిలీవ్ చేయాలని సొసైటీ పర్సన్‌ఇన్‌చార్జి చినబాబుని ఆదేశించారు. దీంతో గోవిందను గురువారం రిలీవ్ చేశారు. అయితే గోవింద గతంలో ఇదే సొసైటీలో ఏసీబీ అధికారుల దాడుల్లో దొరికిపోయి, సస్పెండ్ అయ్యారు. స్థానిక వైసీపీ నాయకులు కొందరు ఆయన్ని మళ్లీ అదే సొసైటీలో ఉద్యోగం వేయించారు. ఈయనపై సొసైటీలో అనేక ఆరోపణలు ఉన్నాయని రైతులు నేరుగా స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన్ని బదిలీ చేయాలని నేరుగా పర్సన్‌ఇన్‌చార్జికి చెప్పడంతో గోవిందని బదిలీ చేశారని సిబ్బంది చెబుతున్నారు. అలాగే సొసైటీకి గత 35 రోజుల నుంచి సీఈవో లేకపోవడంతో లావాదేవీల్లో తీవ్ర జాప్యం జరుగుతుందని రైతులు వాపోతున్నారు. అక్టోబరు 30వ తేదీన సీఈవో రిటైర్ కావడంతో ఈ పోస్టు నేటికి భర్తీ కాలేదు. సీఈవో లేకపోవడంతో రైతులకు ఇవ్వవలసిన రుణాలు మంజూరు, తదితర పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతుందని రైతులు అంటున్నారు. ఇప్పటికైనా సొసైటీకి సీఈవోని నియమించాలని రైతులు కోరుతున్నారు.

కూటమి ప్రభుత్వంలో గ్రామీణ రోడ్లు అభివృద్ధి

▸▸ తాండవ ప్రాజెక్టు చైర్మన్ సత్యనారాయణ



పీకేగూడెం-లక్ష్మీపురం రోడ్డు నిర్మాణానికి పూజ చేస్తున్న సత్యనారాయణ

నాతవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ హయాంలోనే గ్రామీణ ప్రాంత రోడ్లు అభివృద్ధి చెందుతున్నాయని తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ అన్నారు. గురువారం రూ.50 లక్షలతో చేపట్టనున్న పీకేగూడెం-లక్ష్మీపురం రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలో మన్యపురట్ల, వెదురుపల్లి, వల్సంపేట రోడ్లు వేశామన్నారు. అలాగే తాండవ-నాతవరం రోడ్డుకు రూ.3.5 కోట్లను స్పీకర్ అయ్యన్నపాత్రుడు మంజూరు చేయించారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, పీకేగూడెం గ్రామ పార్టీ అధ్యక్షుడు గాడి వెంకటరమణ, శరభూపాలపట్నం సర్పంచ్ లోకవరపు సత్యనారాయణ, నీటిసంఘం అధ్యక్షుడు అచ్చుత వెంకటరమణ అడిగర్ల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల అరికట్టడంపై వంద రోజుల ప్రణాళిక



బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సీడీపీవో శ్రీగౌరి

గొలుగొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల అరికట్టడంపై వంద రోజుల ప్రణాళికను రాష్ట్ర ప్రభుత్వం చేపడుతుందని సీడీపీవో శ్రీగౌరి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల, గ్రామస్థాయి అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో బాల్యవివాహాలపై చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమం గ్రామాల్లో వంద రోజులు నిర్వహించాలన్నారు. కేజీబీవీ విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

9న మండల సర్వసభ్య సమావేశం

నాతవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 9వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎం. సత్యశ్రీనివాసు తెలిపారు ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు హాజరుకావాలని కోరారు. అలాగే మండల స్థాయి అధికారులు తగిన సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని కోరారు.



రావికమతం పాతళవారి పొలాల వద్ద వరి కోతల్లో రైతులు



చీడికాడ మండలం మంచాలలో పూర్తిగా పండిన వరిపంట

ముమ్మరంగా వరికోతలు

▸▸ కూలీలకు గిరాకీ

రావికమతం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావం కాస్త తగ్గి వాతావరణం నెలకొనడంతో రైతులు వరి కోతలు ముమ్మరంగా ప్రారంభించారు. మరోవైపు ఎక్కడ వర్షాలు పడతాయోనన్న భయంతో కోసిన వరి చేలను పొలాల్లో యంత్రాల సాయంతో నూర్పుచేస్తున్నారు. మండలంలోని ఈ ఏడాది ఖరీఫ్ సాగు మూడు వేల హెక్టార్లలో వేశారు. నాట్లు వేసిన నాటి నుంచి ఆశాజనకంగా వాతావరణం ఉంది. స్వల్ప మోతాదులో తెగుళ్ల ఆశించినప్పటికీ వాటిని రైతులు అధిగమించారు. గతంలో కంటే ఈ ఏడాది అన్ని కలిసి రావడంతో పంట బాగా పండింది. కోతలు కోసే సమయంలో వరస తుఫాన్లు వస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులు తీవ్ర ఆందోళన చెందారు. అయినా, ముందుగా నాట్లు వేసిన వరి ప్రస్తుతం పక్వానికి వచ్చింది. దీంతో కొంత మంది రైతులు కోతలు కోసి కుప్పలుగా వేశారు. మిగిలిన అన్నదాతలు పంట కోత కోసే సమయానికి దిత్వా తుఫాన్ ప్రభావంతో రెండు రోజుల పాటు జల్లుల వర్షం పడింది. అప్పటికే కోతలు పూర్తి చేసిన వరి చేలు తడిశాయి. ఈస్థితిలో కొంత మంది కోతలు వాయిదా వేసుకున్నారు. ఇప్పుడు అటువంటి వరి పనలు రెక్కరాల్చే స్థితి ఉంది. మరో రెండు రోజులు పాటు కోతలువద్దని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నా, గింజరాలే స్థితిలో ఉన్న వరిని రైతులు కోతలు కోస్తున్నారు. దీంతో ఒక్కసారిగా కూలీలకుడిమాండ్ నెలకొంది.

తప్పని కష్టాలు

చీడికాడ: ఖరీఫ్ చివరి దశలోనూ రైతులకు కష్టాలు తప్పడంలేదు. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభంలో కొంత వర్షాభావ పరిస్థితులు, ఆ తర్వాత విస్తారంగా వర్షాలు కురిశాయి. దీంతో విస్తారంగా ఖరీఫ్ సాగు చేపట్టారు. ప్రస్తుతం 70శాతం వరకూ బాగానే పండింది. ప్రస్తుతం పొట్టదశకు చేరింది. ఇప్పుడు తుఫాన్ భయంతో రైతులు ఇబ్బందులుపడుతున్నారు. ఇప్పటికే నాలుగు రోజులు వరికోతలు వాయిదా వేశారు. దీంతో పొలాల్లో వరిచేలు పూర్తిగా పండిపోయి గింజలు రాలుతున్నాయి. ఈ స్థితిలో గురువారం ఆకాశంలో మబ్బులు ఉన్నప్పటికీ తెగించిన రైతన్నలు వరికోతల్లో నిమగ్నమయ్యారు.

దివ్యాంగులను ప్రోత్సహించాలి



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో-2 బ్రహ్మాజీ, తదితరులు

రావికమతం డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ విద్యార్థుల్లోని విభిన్న శక్తులు వెలికితీయడానికి క్రీడా పోటీలు దోహద పడతాయని ఎంఈవో-2 బ్రహ్మాజీ, విశాఖ ఉమ్మడి జిల్లా టెలికామ్ బోర్డు అడ్వయిజరీ మెంబరు గల్లా రాజేశ్వరావు, మండల దివ్యాంగుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు గంజి శ్రీనివాసరావు అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం స్థానిక భవిత కేంద్రంలో ఉపాధ్యాయుడు జగన్నాథనాయుడు, సరోజినిల ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలస్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. మైడివాడ హైస్కూల్ పీఈటీ మధు పర్యవేక్షణలో 100 మీటర్ల పరుగు పందెం, జావలిన్ త్రో, షార్ట్‌పుట్, మ్యూజికల్ చైర్ తదితర పోటీలను నిర్వహించారు. విజేతలకు గురువారం బహుమతులు అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగులను ప్రోత్సహిస్తే అన్ని రంగాల్లో అద్భుతాలు సాధిస్తారని అన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన భవన నిర్మాణాల పరిశీలన



డిగ్రీ కళాశాల భవన నిర్మాణపనులు పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

మాడుగుల రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మాడుగులలో నూతనంగా నిర్మిస్తున్న అన్న క్యాంటీన్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులను గురువారం టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు నందారపు సన్యాశిరావు, ప్రధాన కార్యదర్శి పుప్పాల రమేశ్ పరిశీలించారు. స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆదేశాలపై ఈ నిర్మాణ పనులు పరిశీలించామని, త్వరితగతిన పనులు పూర్తి చేసేలా సంబంధిత నిర్వాహకులకు తెలిపామన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

చీడికాడ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తురువోలు ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3గ వరకు విద్యుత్ నిలుపుదల చేయనున్నామని ఆశాఖ ఏఈ నమ్మి వెంకటరావు తెలిపారు. తురువోలు, అర్జునగిరి, జి.కొత్తపల్లి, పెదగోగాడ, వరహాపురం, చుక్కపల్లి, చెట్టుపల్లి గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

రండి..రండి దయచేయండి..

▸▸ వినూత్నంగా మెగా పేరెంట్ టీచర్ సమావేశానికి ఆహ్వానం



వెలంకాయలపాలెంలో రాజు గారి సేవకులుగా వేషధారణలతో తల్లిదండ్రులను ఆహ్వానిస్తున్న చిన్నారులు

రోలుగుంట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మెగా పేరెంట్స్ టీచర్స్ 3.0 సమావేశానికి తల్లిదండ్రులు తప్పక హాజరు కావాలని కోరుతూ ఉపాధ్యాయులు తల్లిదండ్రులను ఆహ్వానిస్తున్నారు. శుక్రవారం జరగనున్న ఈ సమావేశానికి మండలంలోని వెంలకాయలపాలెంలో ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం బండారు సూర్యనారాయణ, ఉపాధ్యాయుడు బి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పాఠశాల కమిటీ చైర్మన్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ ఆదిలక్ష్మి, ఉపాధ్యాయులు బి.చంద్రశేఖర్‌లు విద్యార్థులతో కలిసి తల్లిదండ్రుల ఇళ్లకు వెళ్లి ఆహ్వాన పత్రికలను అందజేసి ఆహ్వానం పలికారు. విద్యార్థులు రాజు గారి బంట్రోతు, రాజు సేవకులుగా వేషధారణల్లో తల్లిదండ్రులను ఆహ్వానించారు. తప్పక హాజరై విజయవంతం చేసి పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

బాల్య వివాహాలను నిరోధించాలి



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు

దేవరాపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బాల వివాహ ముక్త్ భారత్ కార్యక్రమంపై స్థానిక మండల పరిషత్ కార్యాలయం గురువారం అవగాహన సమావేశం నిర్వహించారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ నెల 31 వరకు అన్ని స్కూల్, కళాశాలల్లోని పిల్లలుకు ఈమేరకు వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్నారు. మండల పరిషత్ పరిపాలన అధికారి లక్ష్మీనారాయణ, కార్యదర్శి ఉమాదేవీ, అంగన్‌వాడీ కార్యకర్తలు, పర్య వేక్షకులు పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతా ఉన్నవారందరికీ బీమా సౌకర్యం

దేవరాపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తమ బ్యాంకులో ఖాతా కలిగిన ప్రతి ఒక్కరికీ పీఎంఎస్‌బీవై పథకం కింద జీవిత బీమా పథకం వర్తింపజేస్తామని ఎం.అలమండ స్టేట్ బ్యాంకు మేనేజరు రవి కిరణ్ పేర్కొన్నారు. ఏడాదికి కేవలం రూ.20 చెల్లిస్తే రూ.2లక్షలు ప్రమాద బీమా వస్తుందన్నారు. మండలంలోనిముషిడిపల్లికి చెందిన గురే రాము అనే వ్యక్తి ఇటీవల మరణించడంతో ఆమె భర్తకు రూ.2లక్షల చెక్కును అందజేశారు. అసిస్టెంట్ మేనేజరు బి.కిషోర్‌రెడ్డి, ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్ గణేష్, అప్పారావు. పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

బుచ్చెయ్యపేట డిసెంబరు4 (ఆంధ్ర జ్యోతి): మండలంలో వడ్డాది సెక్షన్ పరిధిలో డీఆర్‌డీఓ, ఫామ్ ఆయిల్ ఫ్యాక్టరీ, బంక్‌లు, మిల్లులు, గృహాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని నర్సీపట్నం డీఈ ఏవీఎన్ అప్పారావు తెలిపారు. నిర్వహణ పనులు చేపడుతున్నందున ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా జ్యోతిర్మయి బాబా శత జయంతి వేడుకలు



బాబా క్యాలెండర్ ఆవిష్కరణలో గంటా సతీమణి శారద, ఎమ్మెల్యే రాజు

బుచ్చెయ్యపేట డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కోమ్మళ్ళపూడి శివారు అమరపురిలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదల సత్యనారాయణ ఆధ్వర్యంలో విశ్వశాంతి జ్యోతిర్మయి బాబా శతజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం శాంతి పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వృద్ధులకు, రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. బాబా భక్తులు ఐక్యారాధనలు, దివ్య గ్రంథం నుంచి ప్రవచనాలు వినిపించారు. ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు సతీమణి శారద, ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి. తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు మల్లు నాయుడు హాజరయ్యారు. ఈ ఆశ్రమాన్ని ఆధ్యాత్మిక పర్యటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఎంపీ సీఎం రమేశ్ మంజూరు చేసిన 20లక్షల తో త్వరలో ఆవరణలో కళ్యాణ మండపం నిర్మిస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. గంటా సతీమణి శారద మాట్లాడుతు బాబా ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. 2026 క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులను ట్రస్ట్ సభ్యులు గజమాల, శాలువతో సత్కరించారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీపీ డి. నాగేశ్వరి దేవి, టీడీపీ నేత కోట నీలవేణి, ఎంవీవీ సత్యనారాయణ, గోకివాడ కోటేశ్వరరావు, వియ్యపు అప్పారావు, ట్రస్ట్ ప్రతినిధులు వెంకయ్యచౌదరి, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.



భారత్‌కు కలిసివచ్చిన ఏసీఏ-వీడీసీఏ స్టేడియం

విజయాల వేదిక

విశాఖపట్నం, స్పోర్ట్స్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పీఎంపాలెంలోని ఏసీఏ వీడీసీఏ స్టేడియం భారత్‌కు విజయాల వేదికగా నిలిచింది. ఇక్కడ ఇప్పటివరకు పది అంతర్జాతీయ వన్డే మ్యాచ్‌లకు ఆతిథ్యమివ్వగా ఏడు మ్యాచ్‌లలో భారత్ విజయశిఖరాలను అందుకోగా, ఒకటి టైగా ముగిసింది. కేవలం రెండు మ్యాచ్‌లలోనే పరాజయం చవిచూసింది. తాజాగా ఈనెల 6న భారత్, దక్షిణాఫ్రికా మధ్య 11వ వన్డే మ్యాచ్‌కు సిద్ధమవుతోంది. ఈ స్టేడియం అందుబాటులోకి వచ్చిన తర్వాత ఏప్రిల్ 5, 2005లో భారత్-పాకిస్థాన్ మధ్య తొలి వన్డే జరిగింది. చివరిగా మార్చి 19, 2023న భారత్-ఆస్ట్రేలియా మధ్య మ్యాచ్ నిర్వహించారు. సుమారు రెండేళ్ల తర్వాత అంతర్జాతీయ వన్డే మ్యాచ్ జరగనున్న నేపథ్యంలో క్రీడాభిమానుల్లో ఆసక్తి పెరిగింది. విరాట్, రోహిత్ వంటి అభిమాన క్రికెటర్లు మరోసారి విశాఖలో ఆడనుండడంతో మరింత ఉత్సుకతతో ఎదురుచూస్తున్నారు.

- ఇప్పటివరకు పది వన్డేల్లో ఏడింట గెలుపు
- తాజాగా 11వ వన్డే మ్యాచ్‌కు ఆతిథ్యం
- 6న భారత్ - దక్షిణాఫ్రికా మధ్య వన్డే
- అత్యధిక పరుగులు, సెంచరీల బ్యాటర్ విరాట్ కోహ్లీ
- అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన రోహిత్ శర్మ
- అత్యధిక జట్టు స్కోరు, విజయాల శాతం భారత్‌దే
- అత్యల్ప స్కోరు చేసిన న్యూజిలాండ్



కోహ్లీ రికార్డు

విశాఖలో ఇప్పటివరకు జరిగిన పది వన్డేల్లో ఏసీఏ వీడీసీఏ స్టేడియం పిచ్‌పై అత్యధిక పరుగులు, వ్యక్తిగత స్కోరు, సెంచరీలు సాధించిన రికార్డు విరాట్ కోహ్లీ పేరిట ఉంది. 2010 నుంచి 2023 వరకు ఇక్కడ ఏడు వన్డేలు ఆడిన విరాట్, ఏడు ఇన్నింగ్స్‌లలో 587 పరుగులు సాధించాడు. వీటిలో మూడు సెంచరీలు, రెండు అర్ధ సెంచరీలున్నాయి. అలాగే వ్యక్తిగత అత్యధిక స్కోరులో కూడా ప్రతిభ చూపాడు. అక్టోబరు 24, 2018లో వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో అజేయ సెంచరీ (157 నాటౌట్) వ్యక్తిగత అత్యధిక స్కోరు నమోదుచేసిన రెండో బ్యాటర్‌గా నిలిచాడు.

రోహిత్ అత్యధిక వ్యక్తిగత స్కోరు

ఈ పిచ్‌పై అత్యధిక వ్యక్తిగత స్కోరు చేసిన రికార్డు రోహిత్ శర్మ పేరిట ఉంది. డిసెంబరు 18, 2019న వెస్టిండీస్‌తో జరిగిన వన్డేలో చేసిన భారీ సెంచరీ (159) రికార్డుగా నిలిచింది. కాగా 2011 నుంచి 2023 వరకు ఏడు మ్యాచ్‌లు ఆడిన రోహిత్ శర్మ..ఏడు ఇన్నింగ్స్‌లలో 355 పరుగులు సాధించి కోహ్లీ తర్వాత రెండోస్థానంలో నిలిచాడు. ఇక వ్యక్తిగత అత్యధిక స్కోరు చేసిన వారిలో మహేందర్ సింగ్ ధోనీ (148) మూడో స్థానంలో ఉన్నాడు. ఏప్రిల్ 5, 2005లో పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో ధోనీ ఈ ఘనత సాధించాడు.



ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో ఇప్పటివరకు జరిగిన వన్డేలు...ఫలితాలు

తేది	తలపడిన జట్లు	గెలిచిన జట్టు
ఏప్రిల్ 5, 2005	భారత్-పాకిస్థాన్	భారత్
ఫిబ్రవరి 17, 2007	భారత్-శ్రీలంక	భారత్
అక్టోబరు 20, 2010	భారత్-ఆస్ట్రేలియా	భారత్
డిసెంబరు 2, 2011	భారత్-వెస్టిండీస్	భారత్
నవంబరు 24, 2013	భారత్-వెస్టిండీస్	వెస్టిండీస్
అక్టోబరు 29, 201	భారత్-న్యూజిలాండ్	భారత్
డిసెంబరు 17, 2017	భారత్-శ్రీలంక	భారత్
అక్టోబరు 24, 2018	భారత్-వెస్టిండీస్	టై
డిసెంబరు 18, 2019	భారత్-వెస్టిండీస్	భారత్
మార్చి 19, 2023	భారత్-ఆస్ట్రేలియా	ఆస్ట్రేలియా

అత్యధిక స్కోరు భారత్‌దే

ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో ఇప్పటివరకు జరిగిన పది వన్డేలలో అత్యధిక స్కోరు నమోదు చేసిన జట్టు భారత్ కావడం విశేషం. డిసెంబరు 18, 2019న వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో నిర్ణీత 50 ఓవర్లలో ఐదు వికెట్లకు 387 పరుగులు చేసి రికార్డు నెలకొల్పింది. ఈ మ్యాచ్‌లో రోహిత్ శర్మ భారీ సెంచరీ (159), కేఎల్ రాహుల్ సెంచరీ (102), శ్రియాస్ అయ్యర్ అర్ధ సెంచరీ (53) చేశారు. అలాగే ఏప్రిల్ 5, 2005న పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో నిర్ణీత 50 ఓవర్లలో తొమ్మిది వికెట్లకు 356 పరుగులు చేసి క్రీడాభిమానులకు క్రికెట్ విందునందించింది. ఈ మ్యాచ్‌లో ధోనీ భారీ సెంచరీ (148), వీరేంద్ర సెహ్వాగ్ (74), రాహుల్ ద్రావిడ్ (52) హాఫ్ సెంచరీలు చేశారు.

న్యూజిలాండ్ పేరిట అత్యల్ప స్కోరు

భారత్‌తో అక్టోబరు 29, 2016న జరిగిన వన్డేలో న్యూజిలాండ్ 23.1 ఓవర్లలో కేవలం 79 పరుగులకు కుప్పకూలి ఈ స్టేడియంలో అత్యల్ప స్కోరు నమోదు చేసిన జట్టుగా నిలిచింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో ఆరు వికెట్లకు 269 పరుగులు చేయగా....న్యూజిలాండ్ 79 పరుగులకు ఆలౌటై 190 పరుగుల భారీ తేడాతో ఘోర పరాజయం పాలైంది. భారత్ బౌలర్ అమిత్ మిశ్రా ఐదు వికెట్లు పడగొట్టాడు.

క్రికెటర్లు వచ్చేశారు!

పీఎం పాలెంలోని ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో శనివారం చివరి వన్డేలో తలపడనున్న భారత్, దక్షిణాఫ్రికా ఆటగాళ్లు గురువారం సాయంత్రం నగరానికి చేరుకున్నారు. భారత్ జట్టులో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, కేఎల్ రాహుల్, యశశ్వి జైస్వాల్, రుతురాజ్ గైక్వాడ్, వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, హర్షిత్ రాణా, కులదీప్ యాదవ్, అర్షదీప్ సింగ్, ప్రసిధ్ కృష్ణ, రిషబ్ పంత్, నితీష్‌కుమార్‌రెడ్డి, ధ్రువ్, తిలక్ వర్మ, కోచ్ గౌతమ్ గంభీర్ ఉన్నారు. దక్షిణాఫ్రికా జట్టులో మార్‌క్రమ్, డికాక్, బవుమా, మాథ్యూ బ్రిట్జ్‌కే, బ్రేవిస్, జోర్జి, యాన్సెన్, బాష్, మార్కో జాన్సెన్, కార్బిన్ బోస్చ్, కేశవ్ మహరాజ్, నండ్రే బర్గెర్, నిగిడి, రియాన్, సుబ్రయెన్, బార్త్‌మేన్ ఉన్నారు. - విశాఖపట్నం



విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న రిషబ్ పంత్, జడేజా, కోచ్ గౌతమ్ గంభీర్, హర్షిత్ రాణా, ప్రసిధ్ కృష్ణ

మన్యం బిడ్డ కరుణకుమారికి సత్కారం

- ఓపెన్‌టాప్ వాహనంలో ఊరేగింపు

విశాఖపట్నం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అంధుల మహిళా టీ20 వరల్డ్ కప్‌లో భారత్ విజయం సాధించడంలో కీలకపాత్ర పోషించిన మన్యం బాలిక కరుణకుమారిని గురువారం కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరల్డ్‌కప్‌ను గెలుచుకోవడంలో కరుణకుమారి కీలకభూమిక పోషించిందన్నారు. క్రమశిక్షణతో పెరిగి ఉన్నత స్థాయికి చేరుకుందని, అందుకు తల్లిదండ్రులు, స్కూల్ ప్రిన్సిపాల్, కోచ్, అధికారులు విశేషంగా కృషిచేశారని పేర్కొంటూ అభినందనలు తెలిపారు. ఎందరో విభిన్న ప్రతిభావంతులకు ఆదర్శంగా నిలిచిన కరుణకుమారి మన ప్రాంత వాసి కావడం గర్వకారణమన్నారు. అనంతరం కరుణకుమారికి లక్ష రూపాయల చెక్‌ను, రాష్ట్రపతి పంపిన జ్ఞాపికను కలెక్టర్ అందజేశారు. ప్రాక్టీస్ కోసం రెండు క్రికెట్ కిట్లు, రూ.50 వేలు అందజేశారు. ఇంకా 'క్రికెట్ ఫర్ ది బ్లైండ్ ఏపీ' రాష్ట్ర ప్రెసిడెంట్ శరత్ కూడా రూ.లక్ష చెక్కు అందజేశారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ ఎ.కవిత, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రతినిధి షీతల్, విద్యార్థులు పాల్గొన్నారు.

డీపీఏబీ స్వచ్ఛంద సభ్యత్వానికి దరఖాస్తుల ఆహ్వానం

కొత్తూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డౌరీ ప్రొహిబిషన్ అడ్వైజరీ బోర్డు (డీపీఏబీ)లో స్వచ్ఛంద సభ్యత్వం నిమిత్తం అర్హత కలిగిన స్వచ్ఛంద సేవా సంస్థల వ్యక్తుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ, సాధికారిత అధికారిణి ఎస్.సూర్యలక్ష్మి తెలిపారు. ఈ మేరకు ఆమె గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి గల వ్యక్తులు తమ వ్యక్తిగత బయోడేటా, ఆయా సంస్థ సేవలకు సంబంధించి పూర్తి సమాచారాన్ని ఈ నెల 5 నుంచి 17వ తేదీలోగా తమ కార్యాలయంలో సమర్పించాలన్నారు. స్వచ్ఛంద సేవా సంస్థల మహిళా అభ్యర్థులకు మాత్రమే ప్రాధాన్యం ఉంటుందని, మరింత సమాచారానికి 08924-293294 ఫోన్ నంబరను సంప్రతించాలని కోరారు.

CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, **PATNALA DURGA PRASAD** (Old Name) S/o. Patnala Apparao, Resident of 22-97-4, Dayal Nagar, Pedagantyada, Visakhapatnam. Change my Name from PATNALA DURGA PRASAD (Old Name) to **PATNALA PRASAD** (New Name) hence forth I am being called as **PATNALA PRASAD** (New Name) for all purposes.
AJV_0263924

CHANGE OF NAME

★ I, **SARAGADAM SUDAKARARAO** (Old Name) S/o. Saragadam Veerinaidu, Resident of 1-134/3, Joseph street, Old Pendurthi, Visakhapatnam. Change my Name from SARAGADAM SUDAKARA RAO (Old Name) to **SARAGADAM SUDHAKARA RAO** (New Name) hence forth I am being called as **SARAGADAM SUDHAKARA RAO** (New Name) for all purposes.
AJV_0263923

CHANGE OF NAME

★ I, **VANKAYALA SWATHI** (Old Name) W/o. Vankayala Gopi Venkata Nagendra Veeraj Kumar, Resident of 25-4-25, Kommireddy vari street, Kakinada. Change my Name from **VANKAYALA SWATHI** (Old Name) to **SOMU SWATHI** (New Name) hence forth I am being called as **SOMU SWATHI** (New Name) for all purposes.
AJV_0263922

GUEST HOUSE

A/C గెస్ట్ హౌస్, గంటల చొప్పున కూడా రూమ్స్ అద్దెకు ఇవ్వబడును. పెదవాల్తేర్, విశాఖపట్నం. సంప్రదించు ఫోన్ నెంబర్స్ : 98664 91739.
AJV_ 242050

WANTED

మీ ఇంటి దగ్గరలో PRO జాబ్. లెస్ వర్క్, లెస్ టైమ్, ఈజీ వర్క్, నో టార్గెట్, గుడ్ కమీషన్. అందరూ అర్హులు. నో ఎక్స్‌పీరియన్స్ సంప్ర : 94909 72901.
AJV_12709

LOST OF PASSPORT

★ **PATNALA PRASAD**, S/o. (L) Patnala Apparao, Residing at D.No.22-97-4, Dayal Nagar, Pedagantyada, Visakhapatnam. Lost my original **Passport No.F1200682** while I am travelling from Gajuwaka to Kancharapalem. If anyone found may please Contact : 7382703218.
AJV_0263925

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

For Advertisement Contact :
9963231176
9966165093

శభాష్ రాంబాబు

- ఎలమంచిలి జడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్ తెలుగు టీచర్‌కు మంత్రి నారా లోకేశ్ ప్రశంస
- తెలుగు భాషాభివృద్ధి, పాఠశాల ఉన్నతికి కృషి చేస్తున్నందుకు అభినందనలు



విద్యార్థులకు బోధిస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు రాంబాబు (ఫైల్)



ముళ్వల రాంబాబు



ఎలమంచిలి తులసీనగర్‌లోని జడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్

ఎలమంచిలి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి):

తెలుగు భాషాభివృద్ధికి విశేష కృషి చేస్తున్న ఎలమంచిలి తులసీనగర్‌లోని జడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్ తెలుగు స్కూల్ అసిస్టెంట్ ముళ్వల రాంబాబును విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ ప్రశంసించారు. తెలుగును బోధిస్తూ, తెలుగు పాఠ్య పుస్తకాలు రచిస్తూ, తెలుగు వికాసానికి పాటుపడుతున్నందుకు అభినందనలు అని నారా లోకేశ్ ఎక్స్‌లో పోస్టు చేశారు. దీంతో ఈ పాఠశాల గురించి, ఉపాధ్యాయుడు రాంబాబు గురించి అందరిలో ఆసక్తి నెలకొంది.

పార్వతీపురం మన్యం జిల్లా పెదబెండపల్లికి చెందిన ముళ్వల రాంబాబు ఎలమంచిలి జడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్‌లో 2023 సంవత్సరం మే 24న తెలుగు ఉపాధ్యాయునిగా చేరారు. బడినే గుడిగా భావించి ఆయన విద్యాబోధన చేస్తున్నారు. ఎంఏ(తెలుగు), ఎం ఏ(సంస్కృతం) చదివిన ఆయన గతంలో 18 సంవత్సరాల పాటు హైస్కూల్ తెలుగు పాఠ్య పుస్తక రచయితగా అనేక మాడ్యూల్స్, ట్రైబల్ వెల్ఫేర్ అభ్యాసిక, దీపిక పుస్తకాలు రచించారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో అర్చక శిక్షణ, శుభప్రదం, ఆలయం అర్చన, పుస్తకాల రచయితగా సుమారు 10 వేల మందికి శిక్షణ ఇచ్చారు. ఉద్యోగ రీత్యా రాష్ట్ర వ్యాప్తంగా స్టేట్ రీసోర్స్ పర్సన్‌గా వేలాది మంది తెలుగు పండిట్‌లకు శిక్షణ ఇచ్చారు. గతంలో అనకాపల్లి సమీపంలోని సీతానగరం పాఠశాలలో పనిచేసిన సమయంలో తోటి ఉపాధ్యాయులు, గ్రామస్థుల సహకారంతో ఆరు వేల పుస్తకాలతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులకు గ్రంథ పఠనంపై మక్కువ పెంచుకునేలా కృషి చేశారు. పుస్తక పఠనం ప్రాధాన్యం తెలియవచ్చేలా గ్రామంలోని ఆలయాల ఆవరణలో కూడా పుస్తకాలను చదువుకునేందుకు ఏర్పాటు చేసేవారు. ప్రతి విద్యార్థి పుట్టిన రోజున ఒక మంచి పుస్తకం కొనుగోలు చేసుకునేలా వారిలో అభిరుచిని కలిగించారు. ప్రస్తుతం ఎలమంచిలి జడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్‌లో తోటి ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థుల సంఖ్య పెరిగేలా కృషి చేశారు. హెచ్‌ఎం సుశీల పర్యవేక్షణలో ఉపాధ్యాయులంతా విద్యార్థులు చదువులో, క్రీడల్లో రాణించేలా తీర్చిదిద్దుతున్నారు. ఈ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థినులు రాష్ట్రస్థాయి అండర్ 19 ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ క్రమంలో ఉపాధ్యాయుడు రాంబాబును మంత్రి నారా లోకేశ్ ప్రశంసించారు.

మంత్రి నారా లోకేశ్‌కు ఘన స్వాగతం

విశాఖపట్నం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లాలో శుక్రవారం జరగనున్న మెగా పేరెంట్, టీచర్ మీటింగ్‌కు హాజరయ్యేందుకుగాను గురువారం నగరానికి చేరుకున్న రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖల మంత్రి నారా లోకేశ్‌కు విమానాశ్రయంలో ఉమ్మడి జిల్లా నేతలు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఆయనకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు పి.గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబు, బండారు సత్యనారాయణమూర్తి, కోండ్రు మురళి, టీడీపీ విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు గండి బాబ్జీ, సీనియర్ నేతలు దాడి వీరభద్రరావు, దువ్వారపు రామారావు, బుద్దా నాగజగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, కోరాడ రాజబాబు, పీవీజీ కుమార్, మహ్మద్ నజీర్, లొడగల కృష్ణ, మళ్ల సురేంద్ర, పుచ్చా విజయకుమార్ తదితరులు స్వాగతం పలికారు. ఎయిర్‌పోర్టు లాంజ్ నుంచి బయటకు వచ్చిన తరువాత పలువురు సందర్శకులు లోకేశ్‌ను కలిసి ఫొటోలు దిగారు. మరికొందరు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో పార్వతీపురం మన్యం జిల్లా భామిని బయలుదేరి వెళ్లారు.

జనవరి ఆఖరున 'అరకు చలి ఉత్సవ్'

- కలెక్టర్ దినేశ్‌కుమార్ వెల్లడి

పాడేరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): 'అరకు చలి ఉత్సవ్'ను వచ్చే ఏడాది జనవరి నెలాఖరులో నిర్వహిస్తామని కలెక్టర్ దినేశ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవ్‌ను డిసెంబరు నెలాఖరున లేదా జనవరి మొదటి వారంలో నిర్వహించాలని తొలుత భావించామని, అయితే విశాఖ ఉత్సవ్‌తో కలిసి అరకు ఉత్సవ్‌ను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దీంతో జనవరి చివరన అరకు చలి ఉత్సవ్ నిర్వహిస్తామని, తేదీలను త్వరలో ప్రకటిస్తామన్నారు.

మహిళ మృతిపై బంధువుల ఆందోళన

విశాఖపట్నం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గైనిక్ సమస్యతో ఈఎస్ఐ ఆస్పత్రిలో చేరిన మహిళ గుండెపోటుతో మృతిచెందింది. అయితే దీనికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆమె బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. వివరాలిలా ఉన్నాయి...

అనకాపల్లి జిల్లా పరవాడ మండలం బోనంగికి చెందిన భార్గవి (39) గైనిక్ సమస్యతో బుధవారం ఈఎస్ఐ ఆస్పత్రిలో చేరింది. వైద్యులు ఆమెను పరిశీలించి, గురువారం ఉదయం 10 గంటల సమయంలో శస్త్రచికిత్స చేశారు. అనంతరం అబ్జర్వేషన్‌లో భాగంగా పక్కనే ఉన్న గదిలో ఉంచారు. ఆపరేషన్ తరువాత ఆమె కోలుకుని, కొంతసేపు బంధువులతో మాట్లాడింది. ఇంతలోనే గుండెపోటు రావడంతో వెంటనే వైద్యులు తక్షణ వైద్యం అందించి, మెరుగైన చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో నగరంలోని ఇండస్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి వెళ్తుండగా ఆమె మృతిచెందింది. మహిళ మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆమె బంధువులు మృతదేహంతో సహా ఈఎస్ఐ ఆస్పత్రికి చేరుకుని మెయిన్‌గేటు ఎదుట ఆందోళనకు దిగారు. సమాచారం మేరకు ఆస్పత్రి వద్దకు మల్కాపురం పోలీసులు చేరుకుని, ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. కాగా ఆస్పత్రిలో చేరినప్పటి నుంచి రోగి ఆరోగ్యం, అందించిన చికిత్స వివరాలను వైద్యుడు సూర్యనారాయణ మృతురాలి బంధువులకు వివరించడంతో వారు ఆందోళన విరమించారు. అయితే ఈఎస్ఐ పరంగా మృతురాలి కుటుంబానికి రావాల్సిన సాయం అందేలా చూడాలని కోరగా, సహకరిస్తామని వైద్యుడు హామీ ఇవ్వడంతో మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు.

క్రైం... crime news

ప్రమాదవశాత్తూ చెరువులో జారిపడి ఒకరి మృతి



రెడ్డి తాతునాయుడు (ఫైల్)

రోలుగుంట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): బహిర్భూమికి వెళ్లి ఓ వ్యక్తి ప్రమాదవశాత్తూ చెరువులో జారిపడి మృతి చెందిన సంఘటన మండలంలోని జేపీ అగ్రహారం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ రామకృష్ణారావు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మండలంలోని జేపీ అగ్రహారం గ్రామానికి చెందిన రెడ్డి తాతునాయుడు అలియాస్ తాతబాబు(52) వ్యవసాయ పనులు చేస్తుంటాడు. గురువారం ఉదయం చెరువు వద్దకు బహిర్భూమికి వెళ్లాడు. ప్రమాదవశాత్తూ చెరువులో కాలు జారి పడి మృతిచెందాడు. ఎంత సేపటికీ అతను ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి వెతకగా చెరువులో విగతజీవిగా పడి ఉన్నాడు. సమాచారం అందడంతో ఎస్ఐ రామకృష్ణారావు ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా తాతునాయుడుకి భార్య రాజు, కుమార్తె భవాని ఉన్నారు.

ఏలేరు కాలువలో బాలుడి మృతదేహం లభ్యం

కశింకోట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉగ్గినపాలెం ఏలేరు కాలువలో గల్లంతైన బాలుడి మృతదేహం గురువారం లభ్యమైందని ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు. ఏలేరు కాలువలో పడిపోయిన చోటు నుంచి వంద మీటర్ల దూరంలో లభ్యమైందని, బయటకు తీసి కుటుంబ సభ్యులకు అప్పగించామని ఎస్ఐ చెప్పారు.

ట్రావెల్స్ బస్సు ఢీకొని మహిళ మృతి

ఎలమంచిలి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొని ఒక మహిళ మృతి చెందిందని రూరల్ పోలీసులు తెలిపారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా వున్నాయి. కశింకోట మండలం అచ్యుతాపురం గ్రామానికి చెందిన అప్పికొండ చిన్నమ్మలు(51) గురువారం ఎలమంచిలి మండలం షేకిళ్లపాలెం జంక్షన్ వద్ద జాతీయ రహదారి దాటుతోంది. ఆ సమయంలో తుని నుంచి అనకాపల్లి వైపు వెళుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఆమెను ఢీకొంది. దీంతో ఆమెకు తీవ్ర గాయాలు కావడంతో అంబులెన్స్‌లో ఎలమంచిలి సీహెచ్‌సీకి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని రూరల్ పోలీసులు తెలిపారు.

పంచ వైష్ణవి క్షేత్ర దర్శనానికి ప్రత్యేక బస్సులు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర మార్గశిర మాసంలో ఒకే రోజున పంచ వైష్ణవి క్షేత్ర సందర్శనకు అనకాపల్లి ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నామని డిపో మేనేజర్ కె. హనుమశ్రీ గురువారం తెలిపారు. ఈ నెల 12వ తేదీన అనకాపల్లి నుంచి సాయంత్రం ఐదు గంటలకు బస్సు బయలుదేరుతుందన్నారు. ద్వారకాతిరుమల (వేంకటేశ్వరస్వామి), అంతర్వేది (లక్ష్మీనృసింహస్వామి), అప్పనపల్లి (బాలబాలాజీస్వామి), ర్యాలీ (జగన్మోహిని కేశవస్వామి), అన్నవరం (వీర వెంకట సత్యనారాయణస్వామి) ఆలయాలకు ఒకే రోజున పంచ వైష్ణవి క్షేత్ర దర్శనం కార్యక్రమం అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. అల్ట్రా డీలక్స్ బస్సును ఏర్పాటు చేస్తున్నామని, ఈ యాత్రకు ఒక్కొక్కరు రూ.1600లు ప్రయాణ చార్జీ చెల్లించాలని ఆమె కోరారు. మరిన్ని వివరాలకు 7382913633, 7382918492, 9959225595 ఫోన్ నంబర్లను సంప్రతించాలని కోరారు. ఇవే కాకుండా విజ్ఞాన, విహార యాత్రలకు అద్దె ప్రాతిపదికన బస్సులు ఇస్తామని పేర్కొన్నారు.

రేపటి నుంచి ఏపీ ఎన్‌జీజీవోస్ జిల్లా సంఘం ఎన్నికలు

అనకాపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్‌జీజీవోస్ జిల్లా సంఘం తాలూకా కమిటీల ఎన్నికలు ఈ నెల 6వ తేదీ నుంచి నిర్వహించనున్నట్టు ఏపీ ఎన్‌జీజీవోస్ జిల్లా అడ్‌హాక్ కమిటీ ఛైర్మన్ పీలా సూర్యనారాయణ (రవి) ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6న చోడవరం, 7న నర్సీపట్నం, 8న నక్కపల్లి, 11న మాడుగుల, 12న సబ్బవరంలో జిల్లా పరిధిలో సంఘం తాలూకా సంఘాల కమిటీల ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు.

జోరుగా వరి కోతలు

... 5వ పేజీ తరువాయి

చీడికాడ, దేవరాపల్లి, కె.కోటపాడు, మాడుగుల, రావికమతం మండలాల్లో 149 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇప్పటికే పదిచోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని, త్వరలో మరో 54 కేంద్రాలను ఏర్పాటు చేస్తామని పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజరు జయంతి తెలిపారు. కాగా రైతులంతా ఒకేసారి వరి కోతలు మొదలుపెట్టడంతో కూలీల కొరత ఏర్పడే అవకాశం వుందని, ఈ సమస్యను నివారించడానికి వరి కోత, నూర్పిడి యంత్రాలను రైతులకు అందుబాటులో వుంచుతున్నామని జిల్లా వ్యవసాయాధికారి ఆశాదేవి తెలిపారు.

మద్యం షాపులకు బెల్టు దెబ్బ

... 5వ పేజీ తరువాయి

మద్యం దుకాణాలు పొందిన వ్యాపారులు లైసెన్సు ఫీజు, షాపునకు అడ్వాన్సు, ఇంటీరియర్ పనుల కోసం సుమారు కోటి రూపాయల వరకు ఖర్చు చేశారు. ఇటీవల మద్యం దుకాణాలకు అనుబంధంగా పర్మిట్ రూమ్ ఏర్పాటుకు మరో రూ.7.5 లక్షలు చెల్లించారు. చుట్టుపక్కల గ్రామాల్లో అనధికారిక బెల్టు షాపుల ద్వారా మద్యం అమ్మకాలతో వ్యాపారం ఆశాజనకంగా వుంటుందని భావించారు. కానీ పర్మిట్ రూమ్‌లకు అనుమతి ఇచ్చిన తరువాత ప్రభుత్వం బెల్టు షాపులపై ఉక్కుపాదం మోపింది. ఎక్కడా మద్యం బెల్టు షాపులు వుండడానికి వీల్లేదని ఎక్సైజ్ శాఖ అధికారులను ఆదేశించింది. దీంతో జిల్లాలో బెల్టు షాపులు క్రమేపీ మూతపడుతున్నాయి. ఆ ప్రభావం అధికారిక దుకాణాలపై పడి, మద్యం అమ్మకాలు సాధారణ స్థాయిలోనే జరుగుతున్నాయి. దీంతో అనుకున్న మేర ఆదాయం రావడంలేదు. రోజుకు కనీసం రూ.3 లక్షల మద్యం అమ్మకాలు సాగితే గిట్టుబాటు అవుతుందని, అంతకన్నా తక్కువ అయితే చేతి చమురు వదులుతుందని వ్యాపారులు అంటున్నారు. చోడవరం సర్కిల్ పరిధిలో 24 మద్యం దుకాణాలకుగాను రెండు, మూడు మినహా మిగిలిన వాటిలో కనిష్ఠంగా రూ.ఒక లక్ష, గరిష్ఠంగా రూ.2.5 లక్షల వరకు అమ్మకాలు జరుగుతున్నట్టు చెబుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో మద్యం వ్యాపారం చేయడంకంటే.. దుకాణాలను మూసివేసి, లైసెన్సులను వాపస్ చేయడం మంచిదని పలువురు భావిస్తున్నారు. మరికొందరు మాత్రం కొత్త సంవత్సరం, సంక్రాంతి, ఆ తరువాత గ్రామ దేవతల పండుగల నేపథ్యంలో మద్యం అమ్మకాలు ఆశాజనకంగా వుంటాయన్న ఉద్దేశంతో వ్యాపారాన్ని కొనసాగించాలని నిర్ణయించినట్టు తెలిసింది.

ఇప్పటికే పలు దుకాణాలు మూసివేత

సబ్బవరం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని పరవాడ మండలంలో ఇప్పటికే ఐదు మద్యం షాపులు మూతపడ్డాయి. పరవాడలో రెండు, వాడచీపురుపల్లిలో రెండు, కలపాకలో ఒక మద్య దుకాణాన్ని మూసివేశారు. చీడికాడ మండలం తురువోలు, పాయకరావుపేట పట్టణంలోని తాండవ షుగర్స్ రోడ్డులో ఒక్కో మద్యం షాపును పూర్తిగా మూసేశారు. చోడవరం మండలం గవరవరం మద్యం దుకాణాన్ని మూసివేయనున్నట్టు సంబంధిత లైసెన్సుదారులు ఇప్పటికే ఎక్సైజ్ అధికారులకు సమాచారం ఇచ్చారు.

గవరవరం షాపునకు రీ-నోటిఫికేషన్

- కేవీపీ నాయుడు, ఎక్సైజ్ సీఐ, చోడవరం

గవరవరంలో మద్యం దుకాణం లైసెన్సును సరెండర్ చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. గవరవరంలో మద్యం దుకాణం ఏర్పాటుకు రీ-నోటిఫికేషన్ ఇస్తాం. ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇతర వివరాల కోసం మా కార్యాలయంలో సంప్రదించవచ్చు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	118.00
లైవ్ ధర	138.00
విత్ స్కిన్	246.00
స్కిన్ లెస్	256.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	640
విజయనగరం	644
శ్రీకాకుళం	644